
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 5 ఏప్రిల్ 2025





పెదరావూరు లేఅవుట్‌లో ఆగిపోయిన ఇళ్లు



విత్తన భారం

రూ. 2.91 కోట్లు

- పెరిగిన పత్తి విత్తనాల ధర
- ప్రోత్సాహం కరువు.. పడిపోతున్న సాగు
- సాగును బతికించుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి సాగు నానాటికీ భారమవుతోంది.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరవవుతోంది.. రైతుల్లోనూ ఆసక్తి తగ్గుతోంది.. ఈ పరిస్థితుల్లో పత్తి కనుమరుగవుతోందా.. అంటే పరిస్థితులు అవునంటున్నాయి. ఏటేటా దారుణంగా పడిపోతున్న పత్తి సాగుపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రోత్సాహకాలను అందించి అయినా పత్తి సాగును బతికించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గత మూడేళ్లలో లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు తగ్గిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో పత్తి సాగుకు ప్రోత్సాహం మాట పక్కన పెడితే విత్తన ధరలు పెంచుకునేందుకు కంపెనీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఖరీఫ్‌లో పత్తి సాగుకు రైతులపై విత్తన భారం పడనున్నది.

పత్తి విత్తన ప్యాకెట్ ధరను రూ.864 నుంచి రూ.901కి పెరగనున్నది. పత్తి సాధారణ విస్తీర్ణం 3.94 లక్షలు ఎకరాలు కాగా ఎకరాకు 475 గ్రాముల రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం. ప్యాకెట్‌కు రూ.37 చొప్పున రెండింటికి 74 ధర పెరిగింది. ఈ ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రైతులపై దాదాపు రూ.2.91 కోట్లు భారం పడనున్నది. పత్తి సాగులో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానం పల్నాడు జిల్లా ఉంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 2022లో 3,42,710 ఎకరాల్లో పత్తి సాగు కాగా గత ఖరీఫ్‌లో 2,22,613 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దాదాపు 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు తగ్గినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఎరువులు, విత్తన ధరలు పెరుగుతున్న విధంగా పత్తి మద్దతు ధర పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులతో పాటు కూలి భారీగా పెరిగి రైతులపై ఆర్థిక భారం పడుతోంది. ఇదే సమయంలో గులాబి రంగు పురుగు వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. పత్తికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటు కావడంలేదు. దిగుబడులు పడిపోవడంతో పాటు మార్కెట్ ధరలు పతనవమవుతుండటంతో పత్తి రైతులు నష్టాలను మూటకట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పత్తి సాగుకు రైతులు దూరమవుతున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న, పొగాకు పంటలను సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పత్తి సాగుకు ప్రోత్సాహకాలు అందించక మరోసారి విత్తన భారం మోపడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేలుకోకుంటే సంక్షోభం..

పత్తి సాగుకు ప్రోత్సాహకాలు అందించాలని.. బీటీ 2 పత్తిపై గులాబి రంగు సోకుతున్నదని, కొత్త రకం పత్తి విత్తనాలను ఉత్పత్తి చేయాలని, ఇందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పత్తి సాగును బతికించుకోకపోతే భవిష్యత్‌లో వస్త్రాలపై ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏటేటా సాగు తగ్గడం వల్ల పత్తి ఆధారిత పరిశ్రమలు కూడా నష్టాల బాట పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు పత్తి సాగును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని లేకుంటే పత్తి సాగుతో పాటు ఆ రంగం కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

మంత్రి ఆదేశించినా.. చర్యలు లేవు

మా డబ్బు పోయింది.. ఇల్లూ సమకూరలేదు.. అధికారులు పట్టించుకోవడం లేదు.. అంటూ పలువురు లబ్ధిదారులు మంత్రి మనోహర్ ఎదుట మొరపెట్టుకున్నారు. ఈ దోపిడీ విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే కాంట్రాక్టర్లపై చర్యలకు ఆదేశించారు. అయినా ఇంతవరకు లబ్ధిదారులకు డబ్బూ రాలేదు.. వైసీపీ ముసుగులోకి కాంట్రాక్టర్లపై చర్య లూ లేవు. ఇప్పటికీ లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఇంటి కల నెరవేరలేదు.. అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ.. పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వారి నుంచి రూ.కోట్లు కొట్టేసిన తిమింగలాలు ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పేరిట గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లబ్ధిదారుల నుంచి రూ.వేలల్లో దోచేశారు. ఇల్లు వస్తోందనే ఆశతో పేదలు అప్పులు చేసి మరీ నగదు తెచ్చి సంబంధిత కాంట్రాక్టర్‌కు అందజేశారు. అధికారులే లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి మరీ కాంట్రాక్టర్ల ముసుగేసుకున్న వైసీపీ తిమింగలాలకు అడ్వాన్స్‌ల రూపంలో రూ.కోట్లు కట్టబెట్టారు. అయితే వారు ఇళ్ల నిర్మాణాలు చేయకపోయినా.. అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం మారింది ఇప్పటికైనా తమ ఇబ్బందులు తొలుగుతాయని లబ్ధిదారులు ఆశించగా అధికారులు కేసులతో సరిపెట్టారు. నెలలు గడుస్తున్నా రూ.కోట్లు కొట్టేసిన వారిపై కనీస చర్యలు లేకపోవడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం నగదు రికవరీ చేసి ఇవ్వాలని వేడుకుంటున్నా పట్టించుకునే వారే లేరు.

కోట్లు కొట్టేసినా.. కేసులతో సరి

- నెలలు గడుస్తున్నా పోలీసుల దాగుడుమూతలు
- వైసీపీ హయాంలో అడ్వాన్స్‌ల పేరుతో నిలువు దోపిడీ
- డబ్బు పోయి.. ఇళ్ల నిర్మాణం జరగక లబ్ధిదారుల లబోదిబో
- కాంట్రాక్టర్ల ముసుగులో పేదలను దోచేసిన వైసీపీ తిమింగలాలు

తెనాలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జగనన్న కాలనీల్లోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు వైసీపీ ముసుగులో పలువురు నేతలు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. వీరికి అధికారులు సహకరించారు. దీంతో వాటాలేసుకుని మరీ లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ములతో పాటు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను మింగేశారు. నిర్మాణాలకు ప్రభుత్వం అందించిన సిమెంట్, ఇనుము, ఇసుకనూ అమ్మేసుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం కేంద్రం ఇస్తున్న నిధులు సరిపోకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఇవ్వకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. అదే సమయంలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై ఒత్తిడి పెంచింది. ఈ క్రమంలో రూ.35 వేల నుంచి రూ.50 వేల చొ ప్పున చెల్లి స్తే ఇల్లు పటిష్టంగా నిర్మించి ఇ ప్పిస్తామని అధికారులు లబ్ధిదారు లకు ఎర వేసి ఆ మేరకు నగదు వసూలు చేశారు. మరికొందరికి డ్వాక్రా కింద రుణాలు ఇప్పించి మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారుల చేతికి ఇవ్వకుండా హౌసింగ్, మెప్మా అధికారులే నేరుగా కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. ఇలా ఒక్క తెనాలి ప్రాంతం లోనే లబ్ధిదారుల నుంచి రూ.8.7 కోట్లు వసూలు చేశారు. ఇందులో కేవలం రూ.3.5 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చేశారని, మిగిలిన రూ.5.2 కోట్లు జాయింట్ ఖాతాలో ఉండాల్సి ఉంటే, దానిలోనూ కొంత మొత్తం పక్కదారి పట్టిందని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. అయినా అధికారులు మాత్రం వాటి లెక్కలు వెల్లడించడం కానీ, దానిపై స్పందించడంకానీ లేదు. ఈ పరిస్థితుల్లో మూడు నెలల క్రితం కొందరు లబ్ధిదారులు తెనాలిలో ఐదుగురు కాంట్రాక్టర్లపై కేసులు పెట్టారు. అయినా పోలీసులు ఇప్పటికీ ఒక్కరిపై కూడా చర్య తీసుకోలేదు. తాజాగా మంత్రి జగనన్న కాలనీల్లో దోపిడీపైనా సీరియస్ అయినట్టు సమాచారం. పైగా వారు పెట్టిన కేసుల వల్ల ఫలితం ఉండదని, కాంట్రాక్టర్లను అరెస్టు చేసి కోర్టుకు పెట్టినా కేసులు నిలబడవంటూ పోలీసులే నేతలకు, లబ్ధిదారులకు చెప్పి తప్పించుకుంటున్న పరిస్థితి.

అధికారులపై అనుమానాలు..

అడ్వాన్సుల పేరుతో నగదు తీసుకున్న వైసీపీ ముసుగులోని కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల తూతూ మంత్రంగా.. మరికొన్ని చోట్ల పునాదులతో ఇళ్ల నిర్మాణాలను సరిపెట్టారు. అయినా అప్పట్లో అధికారులు పట్టించు కోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు కొందరు పోలీసులనూ ఆశ్రయించారు. వారు కేసులు పెట్టడంతో సరిపెట్టారు. వైసీపీ సర్కారు ఉన్నప్పుడు అధికారులు ఆ తిమింగలాలపై చర్యలకు భయపడ్డారంటే ఓకే. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇంకా మీనమేషాలు లెక్కపెడుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లకు డబ్బు పంచిన హౌసింగ్, మెప్మా అధికారులకూ వాటేలేమైనా అందాయా అన్నఅనుమానాలు కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు.

అప్పనంగా దోచేసిన పేదల సొమ్ము

పొన్నూరు, బాపట్ల, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె మున్సిపాలిటీల పరిధిలోనూ రూ.7.5 కోట్ల వరకు వసూలయ్యాయని, వీటిలోనూ రూ.2 కోట్ల మేర కాంట్రాక్టర్ల ముసుగులో పక్కకు వెళ్లాయని అప్పట్లో తేలింది. అధికారులు ఏ లెక్కల ప్రకారం కాంట్రాక్టర్లకు (మిగతా 8వ పేజీలో)



- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతోపాటు నూతన వస్త్రాలు అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

పేదలకు పట్టాభిషేకం

- మన ఇల్లు-మన లోకేశ్‌తో పేదింటికి పండుగ
- రూ.వేయి కోట్ల భూములపై శాశ్వత హక్కులు
- తొలిరోజు 546 మందికి నూతన వస్త్రాలతో పట్టాల పంపిణీ
- హామీలను అమలు చేసి మంగళగిరి రుణం తీర్చుకుంటానన్న మంత్రి లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు.. ఎవరు వచ్చి ఇల్లు కూల్చేస్తారోననే ఆందోళన అవసరం లేదు. ఆక్రమించారు.. ఇక ఖాళీ చేయండి అని బెదిరిస్తారన్న భయం వీడారు. ఏళ్లుగా నివాసం ఉంటున్నా భయంభయంగా ఇంతకాలం ఉన్న వారు లోకేశ్ 'పట్టా'భిషేకంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన ఇల్లు-మన లోకేశ్ నినాదంతో పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు 546 మందికి శాశ్వత నివేశనపట్టాలను నూతన వస్త్రాలతో కలిసి అందజేశారు. ఎర్రబాలేనికి చెందిన 248 కుటుంబాలకు, నీరుకొండలో 99 కుటుంబాలకు, మంగళగిరి రత్నాలచెరువులో 199 మందికి నివేశనపట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.వేయి కోట్ల విలువైన ఆస్తులపై పేదలకు శాశ్వత హక్కును కల్పించేలా నివేశన పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల్లో సమయం చాలా తక్కువ కావడంతో ప్రజలతో పూర్తిగా మమేకం కాలేకపోయానన్నారు. అందుకే నేనెంటో మంగళగిరి ప్రజలకు తెలియలేదని అందువల్లే 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానన్నారు. ఆ ఓటమి బాధ కలిగించినా తనలో కసి పెంచిందని, కష్టపడి ప్రజల మదిని (మిగతా 8వ పేజీలో)



పట్టువస్త్రాలు, ఇంటి పట్టాతో వృద్ధ దంపతుల ఆనందం



గొట్టిపాటి పూర్ణకుమారి, మత్తి అనురాధ, రాములు భాయ్, ఝాన్సీరాణి, మొండితోక రాణి

నామినేటెడ్ జాతర

- మూడు జిల్లాలు.. పది మందికి పదవులు
- రెండో విడతలో మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన



వెంకట్ యాదవ్



మురళీ కృష్ణ యాదవ్



జనార్ధనరావు



వెంకట్రావు



రమేష్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్, ఏప్రిల్ 4: నామినేటెడ్ పదవుల రెండో జాబితాను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. మార్కెట్‌యార్డు పదవులను త్వరలో భర్తీ చేస్తామని ఉగాది పర్వదినానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అన్నట్లుగానే శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 38 మార్కెట్ యార్డులకు చైర్మన్లను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి పది యార్డులు ఉన్నాయి. మూడు జిల్లాలకు కలిపి పది మందిని పదవులు వరించాయి. బాపట్ల జిల్లాలో తొలి విడతలో మార్చి 28న రెండు కమిటీలకు పదవులను ప్రక టించగా శుక్రవారం ఆరు కమిటీల పదవులను భర్తీ చేసింది. దీంతో ఈ జిల్లాలో మొత్తం కమిటీలకు చైర్మన్ల నియామకం ముగిసింది. ఇక పల్నాడు జిల్లాలో తాజాగా వినుకొండ, ఈపూరు, రొంపిచర్ల మార్కెట్ యార్డులకు, గుంటూరు జిల్లా పరిధిలో దుగ్గిరాల యార్డు పదవులను భర్తీ చేశారు. ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామి నేటెడ్ ప్రాతిపదికన భర్తీ చేసే ఏఎంసీ చైర్మన్ల నియామకం కోసం కూటమి పార్టీల ద్వితీయశ్రేణి నేతాగణం ఎదురుచూస్తూ వస్తోంది. ఆశావహులు ఎక్కువగా ఉండడంతో కసరత్తు కోసం ఎక్కువ సమయం తీసుకోవాల్సి రావడంతో జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు, సామాజిక వర్గాలు, పార్టీ విధేయత ప్రాతిపదికగా ఇప్పటికి రెండు విడతలుగా మార్కెట్ యార్డుల చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. యార్డు చైర్మన్ పదవులను దక్కించుకున్న నేతలకు నాయకులు, కార్యకర్తలు (మిగతా 8వ పేజీలో)

- విద్యుత్ మరమ్మతుల్లో అపశృతి
- విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఇద్దరు మృతి
- ఆ కుటుంబాలకు అండగా ఉంటామన్న మంత్రి

కొట్టేసిన కరెంట్

కొల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పునరుద్ధరణకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ఉద్యోగులు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని ఈపూరు గ్రామంలో చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ కె.సుధాకరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున గాలులతో కూడిన వర్షానికి ఈపూరులోని ఓ డొంకలో తాటిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. దీంతో ఈపూరులంక సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయి లంక గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఏఈ సిబ్బందితో తెల్లవారుజామున ఈపూరు చేరుకుని తీగలపై పడిన తాటిచెట్టును యంత్ర సహాయంతో తొలగింపజేశారు. అనంతరం ఆరుగురు సి బ్బందితో తీగలను స్తంభాలకు అమర్చుతున్నారు. ఆ సమ యంలో ఓ తీగలో విద్యుత్ ప్రసరించింది. విద్యుత్ ప్రసరణను గుర్తించిన నలుగురు అప్రమత్తమై దూకేశారు. అయితే దోనేపూడి లైన్‌మన్ పోతార్లంక లీలాదుర్గాశంకర్(40), చిలుమూరు జూనియర్ లైన్‌మన్ ఆకుల మహేష్(37) విద్యుదాఘాతానికి గురై స్తంభాలపై నుంచి కిందపడిపోయారు. ఏఈ, సిబ్బంది వారిని తొలుత కొల్లూరుకు ఆ తర్వాత తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద ఘటనపై ఏఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.



తీగలపై పడిన తాటిచెట్టు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం..

లైన్‌మన్ శంకర్‌కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. సచివాలయ ఉద్యోగిగా విద్యుత్ శాఖలో చేరిన మహేష్ సేవలు అందిస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నా రు. విధి నిర్వహణలో సిబ్బంది మృతి చెందడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి చెందారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటించారు. ఘటనపై విచారణకు మంత్రి ఆదేశించారు. ఎల్‌సీ తీసుకునే విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు. టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ ప్రమాద సమాచారాన్ని ఎమ్మెల్యే ఆనందబాబుకు ఇచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఉద్యోగులు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సి న సహాయాన్ని సత్వరం అందిస్తామన్నారు.



లీలాదుర్గా శంకర్



మహేష్

జీడీసీసీ ఇన్‌చార్జి సీఈఓ ఎవరో..?

- ఈ నెల 14 న అమెరికా వెళ్లనున్న సీఈఓ కృష్ణవేణి
- సభా సంఘం, 51 విచారణ ముందుకు సాగేదెలా..

8

తెనాలి పుర పీఠంపై కూటమి కన్ను

- చైర్‌పర్సన్ పదవి కోసం టీడీపీ పావులు
- వైసీపీని వీడిన కొందరు కౌన్సిలర్లు
- అవిశ్వాసంతో గెలుపునకు అడుగులు
- కలసిరానున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక నీటి కుంటలో దూకి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శిరిగిరిపాడులో శుక్రవారం జరిగింది. శిరిగిరిపాడు గ్రామానికి చెందిన బండి కోటేశ్వరరావు (43) తనకున్న ఐదెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశాడు. గత మూడేళ్లుగా పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లేకపోవడంతో సుమారు రూ. 35 లక్షల దాకా అప్పులు పేరుకుపోయాయి. దీంతో మనస్తాపం చెందిన కోటేశ్వరరావు గ్రామ సమీపంలోని నీటి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య నిర్మలతోపాటు ఇరువురు కుమారులు ఉన్నారు.

డైట్‌లో డిప్యుటేషన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం వద్ద నున్న డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్లు, లెక్చరర్ పోస్టులకు డిప్యుటేషన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రేణుక తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంఈవోలు స్కూల్ అసిస్టెంట్లు ప్రభుత్వ జిల్లా శిక్షణా సంస్థలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల పదవ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ నెల 16, 17 తేదీలలో పరీక్ష, 19వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం 9440846046 నెంబరులో సంప్రదించాలన్నారు.

రూ. 7వేల 200 కోట్లు విడుదలతో ఉద్యోగుల్లో ఆనందం

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ. 25 వేల కోట్లలో కూటమి ప్రభుత్వం ఎన్‌జీవో నేతల విజ్ఞప్తి మేరకు తొలి విడతగా రూ. 7 వేల 200 కోట్లు విడుదల చేయడ పట్ల ఉద్యోగుల్లో ఆనందం నెలకొందని ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు హర్షం వ్యక్తం చేసారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం స్థానిక ఎన్జీవో రిక్రియేషన్ హాలులో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా జేఏసీ చైర్మన్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి జగదీష్, రాష్ట్ర కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన సుమారు ఇరువై అయిదు వేల కోట్ల బకాయిలను విడుదల చేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌లను రాష్ట్ర ఎన్‌జీఓ సంఘ నాయకులు శివారెడ్డి, విద్యాసాగర్‌లు విజ్ఞప్తి చేసారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం దాదాపుగా ఏడువేల రెండు వందల కోట్ల రూపాయల బకాయిలు చెల్లింపు చేసినందు వలన ఉద్యోగులలో ఆనందం నెలకొందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా శ్యామ్ సుందర్ శ్రీనివాస్, అర్గనైజింగ్ కార్యదర్శిగా సుకుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శ్రీవాణి మహిళా సంయుక్త కార్యదర్శిగా విజయలక్ష్మి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ జానీబాష, క్రిష్ణ కిషోర్, విజయ్ బాబులను కో ఆప్షన్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజధానికే ప్రత్యేక ఆకర్షణగా..

అమరావతిలో సెంట్రల్‌పార్కు


- 195 ఎకరాల విస్తీర్ణంలో జోరుగా సాగుతున్న పనులు
- 50.9 ఎకరాల విస్తీర్ణంలో భారీ జలాశయం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతిలో సెంట్రల్‌పార్కు పనులు చాల జోరుగా సాగుతున్నాయి. ఈ సెంట్రల్ పార్కును విట్ యూనివర్సిటీ వెనుకభాగంలో సుమారు 195 ఎకరాల విస్తీర్ణంలో రాజధానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా చాల సుందరంగా మరింత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. దీనికోసం రమారమి రూ 1500 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. సెంట్రల్ పార్కు మధ్య 50.9 ఎకరాల విస్తీర్ణంలో భారీ జలాశయాన్ని ఏర్పాటుచేసి దాని చుట్టూ వివిధ రకాల పార్కులను, అయిదు నక్షత్రాల రిసార్టులను ఏర్పాటుచేస్తారు. ప్రత్యేకించి పార్కు మధ్య వుండే జలాశయాన్ని 50.9 ఎకరాల విస్తీర్ణంలో 0.03 టీఎంసీల నీటిని నిల్వ వుంచేవిధంగా తయారుచేస్తున్నారు. ఈ సెంట్రల్‌పార్కు మధ్య ఏర్పాటవుతున్న ఈ జలాశయానికి నీటిని సరఫరా చేసేందుకు అనంతవరం కొండల నుంచి వస్తున్న వాగుతో దీనిని అనుసంధానం చేస్తున్నారు. ఈ వాగును పది మీటర్ల లోతు 20 నుంచి 30 మీటర్ల వంతున వెడల్పు వుండేలా అభివృద్ధి చేస్తున్నారు. ఇదే సందర్భంలో సెంట్రల్‌పార్కు మధ్య వుండే బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 0.03 టీఎంసీలను మించినట్టయితే దానిని మళ్లీ ప్రత్యేక కాలువ ద్వారా నీరుకొండ వద్ద ఏర్పాటయ్యే జలాశయానికి తరలిస్తారు. ఇందుకోసం నీరుకొండ వద్ద 440 ఎకరాల విస్తీర్ణంలో 0.4 టీఎంసీల సామర్థ్యం కలిగివుండే జలాశయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు నీరుకొండ వద్ద జలాశయం తాలూకు తవ్వకం పనులను ఆరంభించారు. నీరుకొండ జలాశయం-శాఖమూరు సెంట్రల్‌పార్కు మధ్య సుమారు రెండున్నర కిలోమీటర్ల పాటు వున్న గ్యాప్‌లో కొత్తగా కాలువ తీస్తున్నారు. ఈ కాలువ ద్వారా నీరుకొండ జలాశయాన్ని సెంట్రల్‌పార్కు మధ్య వున్న బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్‌తో అనుసంధానం చేస్తున్నారు. ప్రస్తుతం నీరుకొండ జలాశయం, సెంట్రల్‌పార్కు జలాశయం, ఈ రెండింటిని కలుపుతూ కొత్త కాలువ, అలాగే సెంట్రల్‌పార్కుకు ఆవల శాఖమూరు వైపు నుంచి అంటే అనంతవరం వైపునుంచి వచ్చే కాలువ విస్తరణ పనులను ముమ్మరంగా జరిపిస్తున్నారు. ఇందుకోసం నిత్యం 16 జేసీబీల తోపాటు 60కి పైగా ట్రక్కులను నిర్విరామంగా వినియోగిస్తూ పనులను రేయింబవళ్లు జరిపిస్తున్నారు. ఇంకో వైపు కృష్ణాయపాలెం వద్ద కూడ 0.1 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకుగాను 190 ఎకరాల విస్తీర్ణంలో జలాశయం తవ్వకం పనులను ఆరంభించారు. ఈ పనులన్నింటినీ రాజధాని అమరావతి వరద నివారణ చర్యల్లో భాగంగా చకచకా జరిపించేస్తున్నారు. సెంట్రల్ పార్కులో వివిధ రకాల ఉద్యానవనాల ఏర్పాటును మినహాయించి కేవలం జలాశయం, కాలువల నిర్మాణం, నీరుకొండ, కృష్ణాయపాలెం జలాశయాల ఏర్పాటు, కొండవీటివాగు, పాలవాగుల విస్తరణకోసం సుమారు రూ 1236 కోట్లను ఖర్చు చేస్తున్నారు. సెంట్రల్ పార్కులో జలాశయం మినహా మిగతా పనుల నిమిత్తం మరో వేయి కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే వైల్డర్‌నెస్ పార్కుకు ఓ స్థాయి రూపురేఖలను తీసుకువచ్చారు. ఫ్లవర్ గార్డెన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. సెంట్రల్ పార్కు పనులను అతివేగంగా జరిపించడంకోసం ఏడీసీఎల్ ఆయా పనులను విభజించి వేర్వేరు టెండర్ల రూపంలో కాంట్రాక్టులు ఇచ్చింది. దీని ఫలితంగా క్షేత్రస్థాయిలో పనులు చాల జోరుగా సాగిపోతున్నాయి.



సెంట్రల్ పార్కు జలాశయాన్ని నీరుకొండ జలాశయంతో కలిపేందుకు తీస్తున్న కొండవీటి వాగు కెనాల్



సెంట్రల్ పార్కులోని జలాశయం

ప్రభుత్వ ఆమోదం కోసం జడ్పీ బడ్జెట్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2025-2026 అంచనా బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. పాలకవర్గం బడ్జెట్‌ను ఆమోదించని పరిస్థితుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి పంపే వెసులుబాటును ఈ ఏడాది వినియోగించారు. మార్చి 15వ తేదీన బడ్జెట్ ఆమోదం కోసం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ జడ్పీటీసీలు ఆ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఆ తర్వాత వారంలో మరలా సమావేశం ఏర్పాటు చేసేందుకు జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రయత్నం చేశారు. అనివార్య కారణాల వల్ల ఆ సమావేశాన్ని కూడా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సంవత్సరం ఆరంభమయినందున వార్షిక బడ్జెట్‌ను ఆమోదింప చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. పాలకవర్గం బడ్జెట్‌ను ఆమోదించక పోతే దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే అవకాశం ఉంటుంది. రూ. 643.80 కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం పంపారు. ఈ మేరకు సీఈఓ వి జ్యోతి బసు జిల్లా కలెక్టర్ ద్వారా బడ్జెట్ ప్రతిని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి పంపినట్లు తెలుస్తుంది. అక్కడ బడ్జెట్ ఆమోదం పొందటం లాంఛనమే అని అంటున్నారు. ఈ నిర్ణయంతో నూతన ఆర్థిక సంవత్సరంలో జడ్పీ ఖర్చులకు ఉన్న ఇబ్బందులు అన్నీ తొలగిపోయినట్లే అని అంటున్నారు.



జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం పొందిన ఎడ్ల జతతో యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ ఆలపాటి

వేటపాలెం ఎడ్లజతకు ప్రథమ స్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల బల ప్రదర్శనలో జూనియర్ విభాగంలో వేటపాలెం ఎడ్లజత ప్రథమ స్థానంలో నిలిచాయి. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న పోటీలలో అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 3582 అడుగుల దూరం బండ లాగాయి. హైదరాబాద్ రోహన్‌బాబు ఎడ్ల జత 3307 అడుగుల దూరం లాగి రెండవ స్థానం, గుంటూరు సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత 3033 అడుగుల దూరం లాగి మూడవ స్థానం, వెంగయపాలెం వెల్లం సాంబశివరావు ఎడ్ల జత 2902 దూరం లాగి నాల్గవ స్థానం, చల్లపల్లి కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జత 2700 దూరం లాగి ఐదవ స్థానంలో నిలిచాయి. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్ హుబ్లీ వరకే

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వారంలో నాలుగు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగించే నంబరు. 18047 షాలిమార్ - వాస్కోడిగామ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 17, 19, 21, 22, 24, 26, 28 తేదీల్లో సాంకేతిక కారణాల వలన హుబ్లీ వరకే నడపడం జరుగుతుందని గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వలన నంబరు. 18048 వాస్కోడిగామ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 22, 24, 25, 27, 29, మే 1 తేదీల్లో హుబ్లీ నుంచి షాలిమార్‌కు నడపడం జరుగుతుం దన్నారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు సీఎం అభినందన

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్కేటర్, ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు గ్రహీత మాత్రపు జెస్సీరాజ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. తైవాన్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఆర్టిస్టిక్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో జెస్సీరాజ్ రెండు స్వర్ణాలు, రజతం, కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ సచివాలయంలో శుక్రవారం తల్లిదండ్రులు రాధా, సురేష్, సోదరుడు జోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జెస్సీరాజ్ చిరుప్రాయంలోనే అంతర్జాతీయ క్రీడా వేదికపై రాణించడం గొప్ప విషయమని సీఎం చంద్రబాబు ప్రశంసదించారు. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, అందుకోసం అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. జెస్సీరాజ్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని సూచించారు.



ఆటో బోల్తా : వృద్ధురాలి మృతి

వినుకొండటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బతుకుతెరువు కోసం కూలీ పనులకు ఆటోలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడటంతో వృద్ధురాలు మృతిచెందగా మరో 9 మందికి గాయాలైన సంఘటన పిట్టంబండ గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మండలంలోని నాగులవరం గ్రామం నుంచి ఏనుగుపాలెం గ్రామానికి మిరపకోతలకని ప్రయాణిస్తుండగా ఆటో అదుపు తప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఉమ్మడివరం ఎస్సీ కాలనీకి చెందిన జోజమ్మ (55) తీవ్రగాయాలు కావడంతో వినుకొండ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలిస్తుండగా మృతి చెందింది. ఆమెతో పాటు మేడిపల్లి ఆదెమ్మ, విప్పర్ల మరియమ్మ, కృష్ణవేణిలకు తీవ్రగాయాలు కాగా మరికొంతమందికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జోజమ్మ

జనగణనతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు తెలిపారు. సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. 26 జిల్లాల నుంచి ముఖ్య నేతలు హాజరై పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కేసన మాట్లాడుతూ విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన తరహాలోనే రాజధాని అమరావతిలో పూలే విగ్రహాన్ని నిర్మించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా నామినేటెడ్ పదవులు, పనుల్లో 34 శాతం ఓబీసీలకు కేటాయించాలని కోరారు. చట్టసభల్లో 33 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీలకు సబ్ కోటా ప్రకటించాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కన్నా మాష్టారు, పారేపల్లి మహేష్, కోలా అశోక్, కొల్లూరి హనుమంతరావు, ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఉప్పాల శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

కేసనకు ఎమ్మెల్సీకి సిఫార్సు చేయాలి

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవికి కేసన శంకరరావును కూటమి ప్రభుత్వం సిఫార్సు చేయాలని సంఘ నేతలు తీర్మానం చేశారు. గత ఎన్నికల ముందు గుంటూరులో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

వేటాడి.. వెంటాడి ప్రతీకార హత్య

మూడు రోజుల తరువాత మృతదేహం లభ్యం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని అకారణంగా నరికి కోమాలో ఉండేట్టు చేసిన వ్యక్తిపై ఓ మహిళ ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రత్యర్థిని వేటాడి.. వెంటాడి కిడ్నాప్ చేసి హతమార్చి పశువేముల గ్రామ సమీపంలోని పొలాల్లో పడేసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. విజయపురిసౌత్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన బెజవాడ బ్రహ్మం, అతని మామ పండ్ల హరిశ్చంద్ర (64) మధ్య 2024 డిసెంబరు 16వ తేదీన గ్రామంలో ఘర్షణ జరుగుతుండగా సర్దిచెప్పేందుకు బెజవాడ రమేష్, అతని సోదరి మంగమ్మలు ప్రయత్నించారు. ఆ సమయంలో పండ్ల హరిశ్చంద్ర అతని బంధువులు కోపోద్రేకులై బెజవాడ రమేష్, మంగమ్మలపై గొడ్డలితో దాడి చేశారు. రమేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. తన కుమారుడు రమేష్‌ను అకారణంగా నరికి ఆసుపత్రి పాలు చేసినందుకు తల్లి కోటమ్మ ప్రతీకారం పెంచుకుంది. కాగా గొడవ అనంతరం హరిశ్చంద్ర గ్రామం వదిలి తెలంగాణ రాష్ట్రంలోని నాగార్జున సాగర్ నియోజకవర్గం హిల్‌కాలనీలో తలదాచుకుంటున్నాడు. పండ్ల హరిశ్చంద్రను హతమార్చేందుకు కోటమ్మ పథకం పన్నింది. ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీన హిల్ కాలనీ వెళ్లి హరిశ్చంద్ర కోసం కోటమ్మ ఆమె బంధువులైన వెంకన్న, కోటేశ్వరరావు, భాస్కర్, భార్గవ్‌లు కాపుకాచారు. పెన్షన్ తీసుకునేందుకు హరిశ్చంద్ర బయటకు రాగానే అప్పటికే కాపుకాచిన ప్రత్యర్థులు కిడ్నాప్ చేసి కారులో ఎక్కించుకొనిపోయారు. మండలంలోని పశువేముల శివారులోని సీతారామపురానికి అరకిలోమీటరు దూరంలో ఓ వ్యవసాయ భూమిలో హరిశ్చంద్రను హత్య చేసి మృతదేహంపై తాటాకులు కప్పి వెళ్లిపోయారు. గురువారం కురిసిన గాలివానకు తాటాకులు ఎగిరిపోవడంతో శుక్రవారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచె శ్రీనివాసరావు సంఘటనా ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి తెలంగాణ పోలీసులకు సమాచారం అందించారు. హిల్‌కాలనీ పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిల్‌కాలనీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా ఈ నెల 2వ తేదీన హరిశ్చంద్ర మిస్సింగ్‌పై హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. కోటమ్మను హిల్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మిగతా నలుగురు పరారీలో ఉన్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌ని చిరకాలం గుర్తుంచుకొంటాను

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌లో డీఆర్ఎంగా అనేక కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. అవి ఎంతో సంతృప్తినిచ్చాయి. గుంటూరు డివిజన్‌ని చిరకాలం గుర్తుంచుకొంటానని బదిలీపై వెళుతున్న డీఆర్ఎం ఎం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేట ఒకటో లైనులోని రైల్‌మహల్‌లో బదిలీపై నైరుతీ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్‌గా వెళుతున్న డీఆర్ఎం రామకృష్ణకు వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన్ని రైల్వే అధికారులు, యూనియన్ల నాయకులు ఘనంగా సత్కరించారు. డీఆర్ఎం మాట్లాడుతూ తన హ యాంలో రికార్డు స్థాయిలో 3,451 మిలియన్ టన్నుల సరుకు రవాణని అధిగమించడం జరిగిందన్నారు. డివిజన్ ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద మోతాదులో లోడింగ్ జరగడం ఇదే ప్రప్రథమమని చెప్పారు. ఇందుకోసం అధికారులు, సిబ్బంది కష్టపడి బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. తన పదవీకాలంలో రిఫరల్ ఆస్పత్రుల సంఖ్యని 16కి పెంచడం జరిగింది. దీని వలన సిబ్బందికి స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డివిజన్ మొత్తాన్ని తాను ఒకే కుటుంబంగా భావించానని చెప్పారు. లెవల్ క్రాసింగ్ గేట్ల తొలగింపు, ఇంటర్‌లాకింగ్ పనులు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం పనులను పెద్దఎత్తున చేపట్టామన్నారు. రన్నింగ్ స్టాఫ్ పనిగంటలను కూడా తగ్గించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం అందించిన సేవలను ఏడీఆర్ఎం కే సైమన్, ఇతర అధికారులు ప్రశంసించారు. చిన్న ఉద్యోగి సమస్యతో వచ్చినా డీఆర్ఎం ఆలకించి పరిష్కరించేవారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్ తదితరులు పాల్గొని డీఆర్ఎంని సత్కరించారు.

వీడ్కోలు సభలో డీఆర్ఎం రామకృష్ణ



ప్రసంగిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జీజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ల పరిశీలన : జేసీ

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో 2025 సంవత్సరానికి జిల్లా స్థాయి దివ్యాంగుల కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వికలాంగుల సంక్షేమం, ట్రాన్స్ జండర్స్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ భార్గవ తేజ

అజెండాలో పేర్కొన్న వికలాంగుల హక్కుల చట్టం 2016, సర్టిఫికెట్లు, యూడీఐడీ కార్డుల జారీ, పేదరిక నిర్మూలన, వివిధ అభివృద్ధి పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో 5 శాతం రిజర్వేషన్ అమలు, ప్రభుత్వ షాపింగ్, మునిసిపల్ కాంప్లెక్స్‌లలో దుకాణాలు, స్టాళ్ల కేటాయింపు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంక్ రుణాలుపై సమావేశంలో పాల్గొన్న ఎన్‌జీఓలు, అసోసియేషన్ ప్రతినిధులు, కమిటీ మెంబర్స్‌తో చర్చించి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ అధికారిణి సువార్త మాట్లాడుతూ అంధులకు టచ్ ఫోన్‌లు మంజూరై ఉన్నాయని వాటిని శాఖపరంగా అందజేయటం జరుగుతుందని, దానికి 18 సంవత్సరాలు నిండి ఇంటర్ ఎడ్యుకేషన్ ఉండాలని తెలిపారు. ఎవరైనా అలాంటి వారు ఉంటే టచ్ ఫోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రతి రిజర్వాయర్‌ను గడువులోగా శుభ్రం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి రిజర్వాయర్‌ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ నాజ్ సెంటర్ లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్, ఎల్ఆర్ కాలనీ, నల్లచెరువు, చంద్రమౌళి నగర్, రాజేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాని గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం ఆస్తి పన్నును ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి పన్నుపై 5 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 5 శాతం రాయితీని వినియోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు.


కంప్యూటర్‌ను విద్యార్థితో ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు జవహర్ తదితరులు

జడ్పీ పాఠశాలకు వాటర్ కూలర్, కంప్యూటర్ వితరణ

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ కార్యాలయం, గుంటూరు సౌజన్యంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం వాటర్ కూలర్, కంప్యూటర్ వితరణ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన మాట్లాడుతూ బ్యాంక్ మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు రీజనల్ హెడ్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు తమ ప్రముఖ పథకం "యూనియన్ ముస్కాన్" గురించి వివరించారని, ఇది 18 సంవత్సరాల లోపు పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిందన్నారు. విద్యార్థులకు బ్యాంక్ అధికారులు పొదుపు ఖాతాల పాస్ బుక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి డిప్యూటీ రీజినల్ హెడ్ ఎ.రాజేశ్, చీఫ్ మేనేజర్ శ్రీనివాసకుమార్, హరి, సీనియర్ మేనేజర్ హారిక బొమ్మెనా తదితరులున్నారు.


డాక్టర్ ఓపీ రమణను సత్కరిస్తున్న ఏల్చూరి వెంకటేశ్వర్లు, వెచ్చా కృష్ణమూర్తి తదితరులు

హోమియోతో ఆరోగ్యవంతమైన సమాజం : ఏల్చూరి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హోమియో వైద్య రంగంలో విప్లవాత్మకమైన వైద్య విధానాలను తన చికిత్స ద్వారా అందించిన ఘనత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణకే దక్కుతుందని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కళారత్న (హంస) అవార్డు స్వీకరించిన ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ రమణను శుక్రవారం కృష్ణనగర్‌లో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక, సామాజికసేవా సంస్థ ఈవీవీ యువ కళావాహిని ఘనంగా సన్మానించింది. సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ హోమియోతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా నయం చేయవచ్చునని డాక్టర్ రమణ నిరూపించారన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం తన కృషి, ప్రతిభను గుర్తించి కళారత్న పురస్కారంతో గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు దేవరశెట్టి సుబ్బారావు ప్రసంగించారు.

డబ్బులు ఇచ్చి మోసపోవద్దు : సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ల్యాబ్ టెస్టులు, ఇతర వైద్య పరీక్షలకు రోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరికైనా డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహించిన 'పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్'లో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో ఏదైనా పరీక్షలకు డబ్బులు ఇవ్వాలని అడిగితే రోగులు రసీదు అడగాలని ఆయన సూచించారు. రసీదు ఇవ్వని పక్షంలో డబ్బులు అడిగిన విషయాన్ని సూపరింటెండెంట్, ఆర్ఎంవోకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ.సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ బీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సోమేపల్లి వెంకటసుబ్బయ్య జీవితం ఆదర్శనీయం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సోమేపల్లి జీవితం వర్తమాన భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షురాలు షేక్ కాసింబి అన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం, విద్యానగర్‌లో సోమేపల్లి వెంకటసుబ్బయ్య సంస్మరణ సభ నిర్వంచారు. ఆమె మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య తహసీల్దార్‌గా, డిప్యూటీ కలెక్టర్‌గా, జెడ్పీ సీఈవోగా, ఆర్డీవోగా, పులిచింతల ప్రాజెక్టు అధికారిగా నిలువెత్తు నిజాయితీకి నిదర్శనంగా పని చేశారన్నారు. సోమేపల్లి సేవలను జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, అవయవ, దేహదాన ప్రచారోద్యమ నాయకులు వల్లూరి సదాశివరావు కొనియాడారు. అనంతరం సోమేపల్లి వెంకటసుబ్బయ్య సతీమణి విజయలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాదు, చావ శివాజీ, తోటకూర సౌభాగ్యమ్మ, మానుకొండ పద్మావతి, సోమేపల్లి శ్రీవశిష్ట, జి గురవయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.


సోమేపల్లి విజయలక్ష్మిని సత్కరిస్తున్న సాహితీవేత్తలు, జిల్లా రచయిత సంఘం సభ్యులు

ఆటోలకు కొనసాగుతోన్న ట్రాఫిక్ నెంబర్ల కేటాయింపు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్యల ఆధ్వర్యంలో ఆటోలకు ట్రాఫిక్ పోలీసు నెంబర్‌లు, క్యూఆర్ కోడ్‌ల కేటాయింపు కార్యక్రమం కొనసాగుతోంది. ఎవరు కూడా నెంబర్ తీసుకోకుండా ఆటోలు తిప్పవద్దని, ఆటో డ్రైవర్లకు నెంబరు ఒక గుర్తింపుగా ఉంటుందని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం పేరేచర్ల బస్టాండ్ వద్ద సుమారు వంద ఆటోలకు నెంబర్లు ఇచ్చినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

అడ్మిషన్ల క్యాంపెయిన్ ప్రారంభించండి : యూటీఎఫ్

గుంటూరు (విద్య) ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా గడప గడపకు ఉపాధ్యాయులు వెళ్లాలని, తల్లిదండ్రులను కలసి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు యూటీ ఎఫ్ పిలుపునిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం అనే గోడ ప్రతిని శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కళాధర్, యు రాజశేఖర్, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షురాలు నాగమణి, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, ఎం.గోవిందు, షకీలా బేగం, ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింల నిరసన ప్రదర్శన

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించటాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఐక్యవేదికతో పాటు పలువురు ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముస్లింలతో పాటు మైనార్టీ నాయకులైన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, వైసీపీ నేత గులాం రసూల్ పలువురు నాయకులు బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదుట నిరసన ప్రదర్శన ప్రారంభించారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనగా మాయబజార్, జిన్నాటవర్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. వెంటనే ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకొని సవరణను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు షేక్ బాజీ, టోపీ బాబు, షేక్ ఖాజా, మునీర్, నయిమ్, అవాజ్ కమిటీ నాయకులు చిష్టీ, సీపీఐ నాయకులు వలి, బీఎస్పీ నాయకులు చిరతనగండ్ల వాసు తదితరులున్నారు.



ముస్లిం మైనార్టీ నాయకుల నిరసన ప్రదర్శన

ముస్లింల మనోభావాలను గౌరవించాలి

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుకు మద్దతు విషయంలో వైసీపీది ద్వంద్వ వైఖరని, లోక్‌సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో అనుకూలంగా ఓటేశారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మండిపడ్డారు. ఇదంతా జగన్ సూచనతోనే జరిగిందన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లు మద్దతు విషయంలో వైసీపీ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభలో మద్దతుపై జగన్ నిజస్వరూపం మైనార్టీలకు అర్థమైందని చెప్పారు. వైసీపీ వెన్నుపోటు రాజకీయాలను చూసి ముస్లింలు అసహ్యించుకుంటున్నా రన్నారు. ముస్లిం మత ఆచారాలను తమ స్వార్థం కోసం పాతిపెట్టిన వైసీపీ జిల్లా మైనారిటీ నాయకు రాలు ముస్లింల గురించి మాట్లాడటం, వారిని సామాజిక మాధ్యమాల ద్వారా రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం వారి నీచ స్వభావానికి నిదర్శనమని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లులోని కొన్ని అంశాలను టీడీపీ వ్యతిరేకించి, జాయింట్ పార్లమెంట్ యాక్షన్ కమిటీలకి ప్రస్తావించటమే కాకుండా, నిర్మొహమాటంగా పార్లమెంట్‌లో తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు మాట్లాడారని, దానిపై చంద్రబాబు తన స్పష్టమైన వైఖరి తెలిపారని చెప్పారు.

అలరించిన భక్తిగీతాలాపన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మృదురవళి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన భక్తి గీతాలాపన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు రాధామైథిలి శిష్యబృందం కృష్ణచంద్రిక, వరలక్ష్మి, సుజాత, తస్వీశీలు తమ గాత్రధారణలో పలు అన్నమయ్య సంకీర్తనలు, భక్తిగీతాలను శ్రావ్యంగా ఆలపించారు.

ప్రజా సమస్యలపై పోరాడి మన్ననలు పొందిన లక్ష్మణరావు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):నేటి ప్రజా ప్రతినిధులకు భిన్నంగా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన అరుదైన ప్రజాప్రతినిధిగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నిలిచిపోయారని రాజ్యాంగ చర్చావేదిక కన్వీనర్, న్యాయవాది అవధానుల హరి ప్రశంసించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం లక్ష్మణరావు సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో 14 ఏళ్ళపాటు ఎమ్మెల్సీగా పనిచేసిన కేఎస్ లక్ష్మణరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త డాక్టర్ సీహెచ్ సుశీల, ఎస్ హనుమంతరావు తదితరులున్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో షాడో కార్పొరేటర్ రగడ

● సచివాలయ ఉద్యోగులతో ఘర్షణ

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రుణ మేళా దరఖాస్తుల పరిశీలనలో ఎన్టీఆర్ స్టేడియం సమీపంలోని ఓ డివిజన్ చెందిన కార్పొరేటర్ భర్త రగడ చేశారు. తాను చెప్పిన వారి పేర్లను పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించాడు. ఇక్కడ అంతా ఆన్‌లైన్ విధానమని, ఆఫ్‌లైన్ సిస్టం లేదని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ షాడో కార్పొరేటర్ ఉద్యోగులపై ఘర్షణకు దిగి, ఒక ఉద్యోగిని చొక్కా పట్టుకున్నాడు. దీంతో సచివాలయ ఉద్యోగులంతా అక్కడ నుంచి నిరసన వ్యక్తం చేస్తూ బయటికి వెళ్లిపోయారు. వెంటనే స్పందించిన ఉపా సెల్ పీవో జాస్తి రామారావు ఉద్యోగులతో మాట్లాడి సర్ది చెప్పి నిరసన విరమింప చేశారు.

యువతి అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట 10వ లైనులో ఓ షోరూమ్‌లో పని చేస్తున్న తలమాల స్రవంతి (19) అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ ఏరియాకి చెందిన తలమాల స్రవంతి ఇంటర్ వరకు చదివింది. ఆరండల్ పేట 10వ లైను లోని ఒక షోరూమ్ లో సేల్స్ గర్ల్‌గా పని చేస్తోంది. కాగా ఈనెల 3న మధ్యాహ్నం పని చేసే షాపు వద్ద నుంచి స్రవంతి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. తండ్రి సమాధానరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీడీసీసీ బ్యాంకుకు రూ.3 కోట్లకు పైగా టోకరా

● కలెక్టర్ ఆదేశాలతో రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ పై కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు జీడీసీసీ బ్యాంకుకు కోట్ల రూపాయల్లో టోకర వేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం సమీపంలో గల రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులైన అంకిరెడ్డిపాలెంకు చెందిన చల్లా శివనాగిరెడ్డి, పద్మజ దంపతులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంకిరెడ్డిపాలెం కు చెందిన శివనాగిరెడ్డి, పద్మజ దంపతులు తమ కోల్డ్ స్టోరేజీలో చిల్లీస్ నిలవలు లేకపోయినప్పటికీ పెద్ద మొత్తంలో చిల్లీస్ ఉన్నట్లు చూపి సుమారు మూడున్నర కోట్లకు పైగా రుణం తీసుకున్నారు. బ్యాంకు ఉద్యోగులను, సిబ్బందిని లోబర్చుకొని ఈ వ్యవహారం నడిపినట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపారు. కోల్డ్ స్టోరేజ్‌లో చిల్లీస్ నిల్వలు లేనప్పటికీ ఉన్నట్లుగా చూపి లోన్ తీసుకొని తిరిగి చెల్లించలేదని ఇందుకుగాను బ్యాంకుకు మూడు కోట్ల 49 లక్షల 69 వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు. దీంతో క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో బ్యాంకు అధికారులు నల్లపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా రాఘవేంద్ర కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులైన శివనాగిరెడ్డి, పద్మజ దంపతులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీ బస్సుకు నిప్పంటించిన మైనర్‌లు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పార్కింగ్ చేసిన సిటీ బస్సుకు ఆకతాయిలైన మైనర్లు నిప్పంటించడం కలకలం రేగింది. కొరిటెపాడులోని నాయుడుపేట ప్రాంతానికి చెందిన 8, 9 తరగతుల చదువుతున్న ఇరువురు మైనర్లు శుక్రవారం సాయంత్రం ఆడుకుంటూ బృందావన్ గార్డెన్స్ లోని వెంకటేశ్వరస్వామి గుడి ప్రాంతానికి చేరుకున్నారు. సిటీ బస్సులోకి ఎక్కి ఓ డబ్బాలో ఇంజన్ ఆయిల్ ఉండడంతో దానిని బస్సులో పోసి అగ్గిపుల్ల గీసి నిప్పు అంటించారు. ఈ ఘటనతో బస్సు దగ్ధమవ్వగా పక్కనే ఉన్న మరో బస్సుకు కూడా మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ ఇంజన్ తో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బస్సుకు నిప్పు అంటించిన ఇరువురు మైనర్లను గుర్తించి విచారిస్తున్నారు. ఆయా బస్సుల యజమాని, అధికార టీడీపీకి చెందిన కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ కావడంతో ఈ ఘటన వెనుక రాజకీయ కక్షలు ఏమైనా కారణమై ఉన్నాయా అనే పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేశారు. ఈ ఘటన వెనుక ఎటువంటి రాజకీయ కారణాలు లేవని పోలీసులు తెలిపారు.

రేపు రాములోరి కల్యాణం

● చలువ పందిళ్లతో ముస్తాబైన రామాలయాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాల వద్ద సీతారామ కల్యాణం మహోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో పలు దేవాలయాల వద్ద పండుగ శోభ సంతరించుకున్నాయి. స్వామి కల్యాణానికి వీక్షించడానికి వచ్చే భక్తుల కోసం ఆలయాల వద్ద బారికేడ్లు, ఇతర ఏర్పాట్లును చేశారు. శ్రీరామనవమి పురస్కరించుకుని ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామ కల్యాణమహోత్సవం, అనంతరం బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి శ్రీరామ పట్టాభిషేకంపై ప్రవచనం చేస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తెలి పారు. స్తంభాలగరువు, కొరిటెపాడులోని శ్రీ కోదండరామస్వామి దేవాలయాలలో శ్రీ సీతారామ కల్యాణం, గ్రామోత్సవం, కోలాటం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


చౌత్రలోని శ్రీ కోదండ రామాలయం వద్ద పందిళ్లను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు


కొరిటెపాడు శ్రీ కోదండ రామాలయం వద్ద కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

రేపు నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర

శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని ఆదివారం నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కారంశెట్టి లోకేష్ గుప్తా తెలిపారు. అమరావతి రోడ్డు, అంజనేయపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి, శోభాయాత్ర వివరాలను వెల్లడించారు. యాత్ర బృందావన్‌గార్డెన్, శ్రీ వేంకటేశ్వర ఆలయం నుంచి ఉదయం 9.11 గంటలకు ప్రారంభమై శంకర్‌విలాస్, నాజ్ సెంటర్, పాతగుంటూరు, నల్లచెరువు మీదగా రామనామక్షేత్రం వరకు సాగుతుందని వివరించారు. యాత్రలో ప్రజలు, రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు చల్లా బ్రహ్మారెడ్డి, తియ్యు వేణుగోపాలరెడ్డి, అడపా ఫణీంద్ర, తునుగుంట్ల రాజేష్, సాయి, ప్రవీణ్, లక్ష్మీ రామానుజదాసి, జానకిరామ్, రామరాజు, సంజీవ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, పక్కన కమిషనర్

ప్రజారోగ్య రక్షణలో పారిశుధ్యం కీలకపాత్ర

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) ప్రజారోగ్య రక్షణలో పారిశుధ్యం కీలక పాత్ర పోషిస్తుందని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి ఆమె శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యంపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్య పర్యవేక్షణ కోసం శానిటరీ డివిజన్లను 32కు పెంచటంతో పాటు అవసరమైన పుష్ కాట్స్, ప్లాస్టిక్ బిన్స్, ఆటోలు, ట్రాక్టర్లు, అదనపు కార్మికులను కేటాయించామన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ఆశించిన స్థాయిలో పారిశుధ్య పనులు జరుగుటలేదని విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ అమృతం, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, వెహికల్ షెడ్ డీఈఈ సతీష్, ఎస్ఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విలువలకు నిదర్శనం ఆలపాటి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):రాజకీయాల్లో విలువలు, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్సీ ఆలపాటి రాజా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యాప్ర దాతగా ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆలపాటి నేటితరానికి ఆదర్శ రాజకీయ నాయకుడని అన్నారు. ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు వన్నె తీసుకొస్తూ తనకంటూ ప్రత్యేక ప్రజాభిమానాన్ని పొందిన గొప్ప నేత అని చెప్పారు.


ఆలపాటి, నసీర్‌ను గజమాలతో సత్కరిస్తున్న తెలుగు తమ్ముళ్లు

ఘనంగా ఆలపాటి పుట్టినరోజు వేడుకలు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటూరు లక్ష్మీపురంలోని ఆలపాటి కార్యాలయంలో ఆయన అభిమానులు పుష్పగుచ్ఛం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు పంచుమర్తి భూపతిరావు, టీడీపీ నాయకులు కంకణంపాటి లక్ష్మణరావు, అడపా శివ ప్రసాద్‌బాబు, పాములపాటి శ్రీనివాస్, నలబోతు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు..


ఆలపాటికి శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ముస్లింలను మోసగించిన జగన్ : మన్నవ


మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింలకు జగన్‌రెడ్డి దోకా ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ఎప్పుడు ఏ పని చేసినా దానిలో నిజాయితీ, నిబద్ధత రెండూ ఉండవని, వక్ఫ్ పేరుతో వైసీపీ చేస్తున్న రాజకీయాలు కూడా అటువంటివేనని విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు నిన్నటి వరకు కబుర్లు చెప్పిన వైసీపీ నేతలు రాజ్యసభలో కేంద్రానికి అనుకూలంగా ఓటు వేసి ముస్లింలను వంచించారన్నారు. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ పేటెంట్ అని ఎద్దేవా చేశారు. మోసానికి తెగబడిన వైసీపీని ముస్లిం సమాజం క్షమించదని మోహనకృష్ణ హెచ్చరించారు.

మిర్చికి మద్దతు ధర మోసపూరితం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి క్వింటాకు రూ.11,781 ధర నిర్ణయించడం పూర్తిగా మోసపూరితమని కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి అన్నారు. రైతు, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మిర్చి యార్డులో ధర్నా, యార్డు కార్యదర్శి చంద్రికకు వినతిపత్రం అందజేసే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకే స్థిర నిధికరణ ఏర్పాటు చేసి కేంద్రమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.అజయ్‌కుమార్, బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ చార్టులను నిరసిస్తూ ఆర్టీసీ ఉద్యోగుల నిరసన గళం

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-1 డిపో పరిధిలో ఫిక్స్‌డ్ ఛార్టులను వ్యతిరేకిస్తూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్‌లు శుక్రవారం ఉదయం ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డిపో ఎన్ఎంయూ నాయకులు శంకర్, రామకృష్ణ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు షేక్ కరిముల్లా, రత్నాకర్ మస్తాన్‌వలి, మణికుమార్‌లు మాట్లాడుతూ ఉద్యోగులకు అన్యాయం జరిగేలా ఫిక్స్‌డ్ ఛార్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం నాయకురాలు ఓడీ లక్ష్మి, హేమలతలు మాట్లాడుతూ పాత పద్ధతిలోనే రొటేషన్ ఛార్టులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణికుమార్, చిన్నబ్బాయ్, ప్రకాష్ పలువురు నాయకులున్నారు.

వివాహిత ఆత్మహత్య

నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరంట్లకు చెందిన ముక్కల రమాదేవి (40) కడుపు నొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడింది. శ్రీకాకుళంకు చెందిన రమాదేవికి, ముక్కల సతీష్‌కుమార్ తో సుమారు 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసు కొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

NOTICE

IN THE COURT OF THE I ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION):: GUNTUR
E.P.No. 61 / 2024 in O.S.No. 120 / 2021

Between:
Kunamaneni Vamana Rao ...D.Hr
And
Jada Kamalamma ....J.Dr
To,
Jada Kamalamma,W/o.Satyanarayana, R/o.GMC D.No.2-11-510, D.No.16-10-50, Kattavari Street, Old Guntur, Guntur.
పై నెంబరు ఇ.పి.లో జె.డి.ఆర్.అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు నిమిత్తం ది.30-04-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:30-04-2025

కొండూరి కృష్ణారావు, అడ్వకేట్
9వ లైను, ఏ.టి.అగ్రహారం, గుంటూరు-4. సెల్:9849183472

జీడీసీసీ ఇంచార్జి సీఈఓ ఎవరో..?

ఈ నెల 14 న అమెరికా వెళ్లనున్న సీఈఓ కృష్ణవేణి... సభా సంఘం,51 విచారణ ముందుకు సాగేదెలా



గుంటూరు సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీ) ఇంచార్జి సీఈఓ ఎవరు అన్న విషయం పై సందిగ్ధం ఏర్పడింది. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న బ్యాంకు సీఈఓ కృష్ణ వేణి ఈ నెల 14 న అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. సుమారు మూడు నెలల పాటు ఆమె అక్కడే ఉండే అవకాశం ఉండటంతో ఇంచార్జి సీఈఓ నియామకం తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో ఇంచార్జి సీఈఓ గా ఎవరిని నియమిస్తారు అన్న దాని పై చర్చ ఆరంభం అయ్యింది. ఇప్పటికే వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఇంచార్జి సీఈఓ పోస్టును ఇప్పించేందుకు కొందరు అధికారులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. కోర్టు స్టే లపై ప్రమోషన్‌లు పొంది, విధుల్లో కొనసాగే వారిని తీసుకువచ్చి కీలకమైన పోస్టు లో కురోబెట్టబోతున్నారని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆ మేరకు ఇప్పటికే ఫైల్ తయారు చేసినట్లు తెలుస్తోంది. ఇంచార్జి సీఈఓ ను ఎవరు నియమిస్తారు అన్న విషయం లో కూడా స్పష్టత లేదు.ఇదిలా ఉంటే సీఈఓ కృష్ణవేణి అమెరికా వెళ్తే ప్రస్తుతం ప్రభుత్వం ఆరంభించిన విచారణలపై ఆ ప్రభావం పడే అవకాశం ఉంది.బ్యాంకులో జరిగిన వందల కోట్ల రూపాయల అక్రమాలకు సంబంధించిన విచారణ లన్నీ తాత్కాలికంగా అటకెక్కే అవకాశం ఉందని అంటున్నారు.

అంతా 'సహకారమే'..

జీడీసీసీ వేదిక గా జరిగిన అక్రమాలకు సీఈఓ కేంద్ర బిందువు గా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణవేణి సీఈఓ గా వచ్చిన తర్వాత వైసీపీ నేతలు బ్యాంకును ఇష్టానుసారంగా దోచుకున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 42 జీడీసీసీ శాఖల్లో ఇబ్బడిముబ్బడిగా అక్రమాలు జరగటానికి ఉన్నతాధికారుల ప్రోత్సాహం ఎక్కువగా ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జీడీసీసీ ఆవిర్భావ చరిత్రలోనే జరగనన్ని అక్రమాలు గత ఐదేళ్ల లో జరిగాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం అక్రమాలన్నిటినీ చూస్తూ కాలం వెళ్లదీసింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకు అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను విచారించేందుకు చర్యలు ఆరంభం అయ్యాయి .ఇప్పటికే ప్రభుత్వం సెక్షన్ 51 విచారణ ఆరంభించింది.తాజాగా మార్చి 20 వ తేదీన సభా సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీ లో ప్రకటించటం జరిగింది. రేపో, మాపో విచారణ ఆరంభం కానుండగా సీఈఓ సెలవుపై అమెరికా వెళ్ళేందుకు ఏ అధికారి అనుమతి ఇచ్చారు అన్న ప్రశ్నకు సమాధానం లేదు. కీలకమైన సమయంలో ఆరోపణలు ఉన్న అధికారులకు ఎక్కువ కాలం సెలవు ఇవ్వాలంటే ప్రభుత్వ అనుమతి కూడా తప్పనిసరి అన్న నిబంధనలు కూడా ఉన్నాయి.అయినా సీఈఓ అమెరికా పర్యటన కు అనుమతి ఇవ్వడం పై కూడా వివాదం చెలరేగింది.

సెక్షన్ 51 విచారణ ఏమయ్యింది ?

జీడీసీసీ అక్రమాలపై జరుగుతున్న విచారణలు అన్నీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. సీఐడీ, సీబీఐ విచారణ జరిగితే తప్ప నిజాలు నిగ్గు తేలతాయనే వాదన లేకపోలేదు. ఈ నేపథ్యంలో కొద్ది నెలల క్రితం సహకార శాఖ ఉన్నతాధికారులు బ్యాంకు అక్రమాలపై సెక్షన్ 51 కింద విచారణకు ఆదేశించారు. అయితే అసలు ఆ విచారణ ఆరంభం అయ్యిందా లేదా అన్న దానిపై ఏ విధమైన సమాచారం బయట ప్రపంచానికి తెలియదు. విచారణ అధికారి అక్కడకు ఇక్కడకు వచ్చిన దాఖలాలు కూడా లేవని పలువురు చెబుతున్నారు.

తెనాలి పుర పీఠంపై కూటమి కన్ను

- చైర్‌పర్సన్ పదవి కోసం టీడీపీ పావులు
- వైసీపీని వీడిన కొందరు కౌన్సిలర్లు
- అవిశ్వాసంతో గెలుపునకు అడుగులు
- కలసిరానున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఓట్లు



తెనాలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు.. సార్వత్రిక ఎన్నికల్లో అడ్రసు లేకుండా వైసీపీని తుడిచేశారు. ఇటీవల స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఎక్కువ శాతం పదవులను కైవసం చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో తెనాలి మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు కన్నేశాయి. ఇప్పటికే వైసీపీ గూటినుంచి టీడీపీ, జనసేన పార్టీల్లోకి వైసీపీ కౌన్సిలర్లు కొందరు చేరారు. మరికొందరిని లాగేసేకుంటే మున్సిపల్ పీఠం దక్కుతుందని కూటమి నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేశారని తెలుస్తోంది. గత ఎన్నికల్లో తెనాలి మున్సిపాల్టీలో 40 వార్డులకు 32 కౌన్సిలర్ స్థానాలను వైసీపీ గెలుచుకుంటే, 8 స్థానాలను టీడీపీ దక్కించుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీలోకి ఒకరు, జనసేనలోకి ముగ్గురు చేరారు. మరో ఇద్దరు కౌన్సిలర్ల భర్త, తండ్రి జనసేన కండువా కప్పుకున్నారు. మరో ఏడుగురు టీడీపీ, జనసేనలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. ఇవన్నీ జరిగితే కౌన్సిల్‌లో కూటమి బలం 23కి చేరినట్లే. ఒకవేళ వీరిలో ఎవరైనా జారుకున్నా, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఓట్లు కూడా కూటమికి కలసిరానున్నాయి. వైసీపీ కౌన్సిలర్లు సానుకూలంగా ఉండటంతో చైర్‌పర్సన్ పీఠాన్ని పడగొట్టటం సునాయాసమే అవుతుందనేది కూటమి నేతల ఆలోచన. వైసీపీలోని కీలక నాయకులు కూడా టీడీపీ కండువా కప్పుకోవడానికి సిద్ధపడినట్లు సమాచారం. అదే జరిగితే కౌన్సిల్లో కొద్దిమంది మినహా మొత్తం కూటమి చేతుల్లోకి వచ్చినట్లే. అయితే అవిశ్వాసం పెట్టాల్సిన పరిస్థితి వస్తుందా! లేక పార్టీల చేరికలతోనే కూటమి ఖాతాలోకి తెనాలి మున్సిపాలిటీ చేరిపోతుందా అనేది చూడాల్సిందే. ఈ కొద్దికాలానికి మున్సిపల్ పీఠం ఎవరి ఖాతాలో ఉంటే ఏమిటని? ఎన్నికలు ముందుంచుకుని ఈ తొందరపాటు వద్దంటూ కూటమి పెద్దల్లో కొందరు హితవు పలుకుతున్నారు.

ఆలోచనలో పడిన చైర్‌పర్సన్..

వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చైర్‌పర్సన్ పీఠం చెరిసగం కింద ఇద్దరికి ఒప్పందం కుదిరింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఒప్పందం ప్రకారం గడువు ముగిసింది. దీంతో తాడిబోయిన రాధికకు రెండో దఫా కింద చైరపర్సన్ పీఠం దక్కింది. అయితే ప్రస్తుతం కూటమి నేతలు పావులు కదుపుతుండటంతో వారూ ఆలోచనలో పడినట్లు సమాచారం. రెండో దఫాకింద పదవి వచ్చినా తక్కువ కాలమే కావడంతో దానిని వదిలిపెట్టి వెళ్లడానికి వారూ సిద్ధంగా లేరనేది సమాచారం. అయితే కూటమి మద్దతు ఉంటే తమ పదవి పదిలంగా ఉంటుందన్న ఆలోచనతో వారు ఎత్తుకు పైఎత్తులు వేసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఊహాగానాల ప్రకారం చైర్‌పర్సన్ రాధిక కుటుంబం టీడీపీ కానీ, జనసేనలోకి కానీ చేరితే పదవి ఉంటుందన్న హామీ ఆ నేతల నుంచి రావాల్సి ఉంది. అయితే అది ఎంతవరకు సఫలం అవుతుందనేది సందేహమే. అయితే ఈ ఊహాగానాలపై స్పందించటానికి మాత్రం ఆమె సుముఖత చూపలేదు.





ముట్లూరు - లేమల్లెపాడు గ్రామాల మధ్య అకాల వర్షానికి తడిచి ముద్దయిన మిర్చి కల్లాలు, పెదనందిపాడు వద్ద మొక్కజొన్న కల్లాలపై నిలిచిన వర్షపు నీరు

మిర్చి రైతులను భయపెట్టిన చిరుజల్లులు

- అర్ధరాత్రి 1 గంట సమయంలో యార్డు పరిసరాల్లో వర్షం
- అప్రమత్తమై టార్పాలిన్ పట్టాలను కప్పేసిన రైతులు

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అసలే మిర్చికి ధర లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతులను అకాలవర్షం భయపెట్టింది. గురువారం అర్ధరాత్రి దాటాక మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లో నాలుగైదు నిమిషాల పాటు కురిసిన చిరుజల్లులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మిర్చి తడిసి పాడైపోతుం దేమోనని టార్పాలిన్ పట్టాల కోసం పరుగులు తీశారు. మరోవైపు యార్డు సిబ్బంది మైకులో పదేపదే మిరపకాయల టిక్కీలను టార్పాలిన్ పట్టాలతో కప్పాలని ప్రకటనలు చేయడంతో కమీషన్ దుకాణాల వెలుపల అన్‌లోడింగ్ చేసిన వాటిపై పట్టాలు కప్పారు. అలానే కొన్ని టిక్కీలను షెడ్ల కిందకు చేర్చి తడవకుండా చూశా రు. అయితే ఐదు నిమిషాల వ్యవధిలోనే వర్షం నిలిచిపోవడంతో రైతాంగం ఊపిరి పీల్చుకొన్నది.

మిర్చియార్డుకు రోజులానే శుక్రవారం ఉదయం విక్రయాల కోసం గురువారం రాత్రి ఏడు గంటల సమయం నుంచే మిర్చి టిక్కీలతో రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మొత్తంగా 1,13,955 టిక్కీలు వచ్చాయి. కమీషన్ దుకాణాల వద్దకు వచ్చిన టిక్కీలలో చాలా వరకు షెడ్ల కింద అన్‌లోడింగ్ చేయించారు. ఖాళీ లేని దుకాణాల ఎదుట కొన్ని టిక్కీలను దిగుమతి చేశారు. వర్ష సూచన తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు ఐఎండీ సమాచారం జారీ చేసింది. కోస్తాంధ్రకు ఎలాంటి హెచ్చరిక లేకపోవడంతో వర్షం గురించి ఎవరూ ఆలోచన చేయలేదు. అలాంటిది అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చిరుజల్లులు రావడం రైతులను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. ఎలాంటి నిరీక్షణ లేకుండా వెనువెంటనే యార్డులోకి లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు మిర్చి టిక్కీలతో ప్రవేశించేందుకు వీలుగా నల్లపాడు రోడ్డులో అన్ని గేట్లను తెరిచారు. దీంతో వాహనాలు వేగవంతంగా యార్డులోని కమీషన్ దుకాణాలకు చేరుకొన్నాయి. బుధ, గురువారంలలో వచ్చిన మిరపకాయల్లో తేమ శాతం అధికంగా ఉన్న వాటిని యార్డులోనే ఆరబోశారు. వాటిని మాత్రం టార్పాలిన పట్టాలు కప్పి తడవకుండా చూశారు. కోల్డ్‌స్టోరేజ్‌ల వద్ద కూడా మిర్చి టిక్కీలు తడవకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకొన్నాయి. వర్షం మరి కాసేపు కురిసి వుంటే రైతులకు తీవ్రంగా నష్టం జరిగివుండేదని వ్యాపారవర్గాలు తెలిపాయి. ప్రకృతి విపత్తులు సంభవించే సీజన్ దృష్ట్యా యార్డులో టార్పాలిన్ పట్టాలను సంసిద్ధంగా ఉంచాలని రైతులు, వ్యాపారస్థులు మార్కెటింగ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రూ.కోట్లు కొట్టేసినా.. కేసులతో సరి

(5వ పేజీ తరువాయి)



శిరిపురం లేఅవుట్‌లో ఆగిపోయిన ఇళ్లు

నగదు ఇచ్చారో కూడా అంతుబట్టని విషయం. ఒక్క ఉదాహరణ చూస్తే, పేదల సొమ్ము ఎంత అప్పనంగా దోచిపెట్టారనేది అర్థమవుతుంది. తెనాలిలో పెదరావూరు, శిరిపురం లేఔట్లలో ఇళ్లు నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టర్‌కు ఒకేసారి రూ.55 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించేశారు. అయితే ఆయనకు అప్పగించిన రెండింటిలో ఒక బ్లాక్ కిం ద లబ్ధిదారులు రూ.25 లక్షలు, రెండో బ్లాక్ కింద రూ.18 లక్షలు చెల్లించారు. కాంట్రాక్టర్‌కు లెక్కాపత్రం లేకుండా రూ.55 లక్షలు ముందస్తుగా ఇచ్చేశారు. కానీ అతను ఇళ్ల నిర్మాణమే చేయలేదు. లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో పాటు అదనంగా ఇచ్చిన నగదును ఇంతవరకు రికవరీ చేయలేదు. ఇదే తరహాలో మరో ఐదుగురు కాంట్రాక్టర్ల పరిస్థితి ఉన్నా అధికారులు చర్యలు సున్నానే. ఈ ఒక్క పట్టణ పరిధిలోనే రూ.3.5 కోట్లు కాంట్రాక్టర్‌లకు అప్పనంగా ఇచ్చేశారు. వీరిలో కొందరు పనులు చేస్తే, మరికొందరు అసలు పత్తాలేకుండా పోయిన పరిస్థితి ఉంది.

రాక్రీట్ సంస్థ దోపిడీపై చర్యలు లేనట్టేనా

గుంటూరు నగరం, పేరేచర్ల వంటి మరికొన్ని లేఔట్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బంధువులకు చెందినదిగా చెప్పుకొచ్చిన రాక్రీట్ అనే సంస్థకు 5,452 ఇళ్ల నిర్మాణాన్ని వైసీపీ సర్కారు అప్పగించింది. అయితే ఇళ్ల నిర్మాణాలు చేయకపోవడంతో అప్పటి గుంటూరు కలెక్టరు హెచ్చరించడంతో పాటు డబ్బు తిరిగి చెల్లించకుంటే కటకటాల వనక్కు నెడతామని హెచ్చరించారు. అంటే పేదల ఇళ్ల పేరిట ఆ సంస్థ దోపిడీ ఏమేర ఉందనేది అర్థమవుతుంది. వైసీపీ హయాంలోనే కలెక్టర్ సీరియస్ అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు లేకపోవడం విస్తు కలిగిస్తుందని లబ్ధిదారులు అంటున్నారు. ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.50 వేలు, రూ.60 వేలు, రూ.70 వేలు వంతున 4,321 ఇళ్లకు రూ.26.4 కోట్లను ఆ సంస్థ చేతిలోపెట్టారు. అయితే ఆ సంస్థ కేవలం 1131 ఇళ్లు మాత్రమే నిర్మించగా, మరో వెయ్యి వరకు వివిధ దశల్లో ఉన్నాయి. ఎక్కువ శాతం పునాదుల దశలోనే ఆగిపోయాయి. అయినా రూ.26.4 కోట్లలో ఎంత రికవరీ చెయ్యాలనే లెక్కలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇదే తరహాలో చాలా మండల కేంద్రాల్లోనూ స్థానిక వైసీపీ నేతలకు కాంట్రాక్టర్ ముసుగు కప్పి అప్పట్లో జనం సొమ్ము దోచిపెట్టారు.



పట్టాల పంపిణీల అనంతరం భోజనం చేస్తున్న ప్రజలు

పేదలకు పట్టాభిషేకం

(5వ పేజీ తరువాయి)

గెలుచుకోవాలనుకున్నానన్నారు. ఏ సంఖ్యతో ఓడిపోయానో దానిపక్కన ఇంకో సున్నా ఉండేలా గెలవాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేసి అంతకుమించి సాధించానన్నారు. మొత్తం 26 రకాల సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు గత ఐదేళ్లు నిరంతరాయంగా సేవలు అందించడంతో నన్ను గొప్పగా ఆశీర్వదించారన్నారు. రెండున్నర దశాబ్దాల కలగా మిగిలిపోయిన శాశ్వత ఇంటిపట్టాలను అందించాలని ఎన్నికల ప్రచారంలో ప్రజలు కోరారన్నారు. మూడు విడతలుగా ఇంటిపట్టాలను అందిస్తానని నాడు మాటిచ్చానని ఆ ప్రకారం మొదటి విడతగా మూడు వేలమందికిపైగా పట్టాలను పంపిణీ చేయిస్తున్నట్లు తెలిపారు. అటవీ, దేవదాయ, రైల్వే భూముల విషయంలో చిక్కుముడులున్నాయని, కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. మంత్రివర్గ ఆమోదం తీసుకుని మరీ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. అవినీతికి తావు లేకుండా ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఓ యజ్ఞంగా చేపట్టామన్నారు. గత ఎన్నికల సందర్భంలో కుప్పం కన్నా మంగళగిరి వెనుకబడి ఉందని చంద్రబాబు హెచ్చరించగా కుప్పం కన్నా మంగళగిరిలో తనకు ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని ఆనాడు చెప్పానన్నారు. అయితే అప్పట్లో అందరూ ఎగతాళి చేశారని, భారీ మెజారిటీతో తనను చంద్రబాబు అభినందించారని చెప్పారు.

మెజార్టీ బలంతోనే..

నాకు ఎంత ఎక్కువ మెజారిటీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పానని, మంగళగిరికి వంద పడకల ఆస్పత్రి కావాలని కేబినేట్‌లో అడిగితే ఎవరూ కాదనలేకపోయారన్నారు. లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి నిధులు అడిగినా ఎవ్వరూ కాదనలేదన్నారు. భూగర్భ డ్రెయినేజీ, భూగర్భ గ్యాస్, భూగర్భ పైప్లైన్లు చివరకు భూగర్భ కరెంట్ పనులు వచ్చే రెండు నెలల్లో ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. వంద పడకల ఆస్పత్రికి 13న శంకుస్థాపన చేస్తామన్నారు. మంగళగిరిలో పార్కులు, చెరువుల అభివృద్ధితోపాటు కల్యాణమండపాలు, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు, చేనేత పార్కు, చేనేత క్లస్టర్లకు సంబంధించి నేనిచ్చిన ప్రతీ హామీలను ఆచరణలో చేసి చూపిస్తానని తెలిపారు.

నామినేటెడ్ జాతర

(5వ పేజీ తరువాయి)

అభినందనలు తెలిపారు.

వరించిన పదవులు

బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు ఏఎంసీ చైర్మన్ పదవి అమృతలూరుకు చెందిన మాజీ ఎంపీపీ గొట్టిపాటి జయవెంకట పూర్ణకుమారిని వరించింది. రేపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మత్తి అనురాధ(జనసేన)కు దక్కింది. కూచినపూడి ఏఎంసీ చైర్మన్ పదవి నిజాంపట్నం మండల టీడీపీ అధ్యక్షుడైన ఓగిబోయిన వెంకటయాదవ్(బీసీ)ను వరించింది. పర్చూరు ఏఎంసీ గుంజి వెంకట్రావు(బీసీ), చీరాల మార్కెట్ కమిటీ చైర్మన్ కౌతారపు జనార్దన్‌రావు(బీసీ), అద్దంకి నియోజకవర్గ పరిధిలోని సంతమాగులూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తేలప్రోలు రమేష్‌లను వరించింది. ప్రపంచంలోనే పసుపునకు ప్రసిద్ధి చెందిన దుగ్గిరాల వ్యవసా యమార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నం ఝాన్సీరాణి నియమి తులయ్యారు. టీడీపీలో వివిధ హోదాల్లో కొనసాగిన ఝాన్సీ సేవలను గుర్తించిన అధిష్ఠానం యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించింది. పల్నాడు జిల్లా పరిధిలోని రొంపిచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మొండితోక రాణి నియమితులయ్యారు. ఈపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జరపల రాములుభాయ్‌ను వరించింది. వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన మీసాల మురళీకృష్ణయాదవ్‌ను వరించింది.

వీవీఐటీలో 23 చిత్ర బృందం సందడి

పెదకాకాని, నరసరావుపేట టౌన్‌ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యువ నటుడు తేజ రాయపాటి, తన్మయి ప్రధాన పాత్రలలో మల్లేశం ఫేమ్ రాజ్, రాచకొండ దర్శకత్వంలో స్టూడియో 99, స్పిరిట్ మీడియా పతాకంపై నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందించబడిన చిత్రం ' 23'. ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ కార్యక్రమంలో హీరో తేజ, హీరోయిన్ తన్మయి, డైరెక్టర్ రాజ్, డాక్టర్ రాయపాటి మమత, యాంకర్ దీప్తి నల్లమోతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లడుతూ తెలిసి తెలియక జీవితంలో చేసే చిన్న చిన్న తప్పులు పెద్ద నేరాలుగా మారుతాయని అటువంటి తప్పులను ఎలా సరిదిద్దుకోవాలి లేదా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఉన్నతంగా ఎలా జీవించాలనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుందని తెలిపారు. హీరో తేజ మాట్లడుతూ ఈ చిత్రం సోషల్ మెసేజ్తో పాటు స్నేహం, ప్రేమ అంశాలపై రూపొందించడం జరిగిందనీ ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలసి గీతాలాపన, నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సినీ నటుల సందడి

నరసరావుపేట పట్టణంలోని కృష్ణవేణిడీగ్రీ కళాశాలలో సినీ నటులు శుక్రవారం సందడి చేశారు. 23 మూవీ ప్రి రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర బృందం నిర్వహించింది. ఈ సినిమా హీరో రాయపాటి తేజ మాట్లాడుతూ 23 చిత్రం మొదటి సినిమా అని చెప్పారు. మా శ్రేయోభిలాభి అయిన కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సమక్షంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.



గుంటూరులోని ప్లాటినోస్ థియేటర్ ప్రసంగిస్తున్న హీరో తేజ, హీరోయిన్ తన్మయి

మహోన్నతుడు పుచ్చలపల్లి

- జాతీయస్థాయి నాటికల పోటీల్లో వక్తలు
- సత్యాజు బాలచందర్‌కు పుచ్చలపల్లి కళాపురస్కారం

యడ్లపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కమ్యూనిస్టు నాయకులు, కళా నిలయం సభ్యులు తెలిపారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం 22వ జాతీయ స్థాయి నాటికల పోటీలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రంగస్థలానికి దశాబ్దాలుగా సేవలందించిన గుంటూరు సంస్కృతి వ్యవస్థాపకుడు సత్యాజు బాలచందర్‌ను పుచ్చలపల్లి సుందరయ్య కళాపురస్కారంతో సత్కరించారు. బాలచందర్ జీవితగ్రంథాన్ని ఆజోవిభో కుందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజోస్యుల సత్యన్నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముత్తవరపు అరుణకుమారి, సురేష్‌బాబు, రచయితలు పీ మృత్యుంజయరావు, నటుడు రచయిత జరుగుల రామారావు, గుంటూరు కళాపరిషత్ అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, కవిరాజు సాహితీసమితి అధ్యక్షుడు ఆలోకం పెదబ్బయ్య, ప్రజాగాయకుడు పీవీ రమణ, ప్రజానాట్యమండలి జిల్లా మాజీ కార్యదర్శి నూతలపాటి కాళిదాసు, కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, ఉపాధ్యక్షుడు జరుగుల శంకరరావు, కార్యదర్శి రామారావు, నిర్వాహకులు జరుగుల శంకరం, ముత్తవరపు పద్మారావు, నూతలపాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



బాలచందర్‌కు పుచ్చలపల్లి సుందరయ్య కళాపురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

సమకాలీన పరిస్థితులకు అద్దం పట్టిన ప్రదర్శనలు

నాటికల పోటీల్లో తొలిరోజు మూడు నాటికలను ప్రదర్శించారు. గ్రామీణ వైద్యంలో మార్పు తేవాలనే సందేశంతో 'చిగురు మేఘం' నాటికను అమరావతి ఆర్ట్స్ గుంటూరువారు ప్రదర్శించారు. ఈ నాటికను కావూరి సత్యన్నారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. పెద్దల జ్ఞానానికి మించిన జ్ఞానం ఏదీ లేదంటూ సాగే నాటిక 'కిడ్నాప్'ను ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారు ప్రదర్శించగా ఈ నాటికను చెరుకూరి సాంబశివరావు రచించి, దర్శకత్వం వహించారు. విడాకులు సమస్యకు పరిష్కారం కాదని తెలియచేస్తూ 'విడాకులు కావాలి' నాటికను అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి ప్రదర్శించారు. ఈ నాటికను వల్లూరి శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.



చిగురు మేఘం నాటికలోని ఓ దృశ్యం

సేద్యానికి దక్కిన అరుదైన గౌరవం

- దేశంలోని ప్రధాన లైబ్రరీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్ర పుస్తకాలు
- ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ సహా మరో మూడు చోట్ల




లైబ్రరీల్లో ఉంచిన పుస్తకాలివే

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించి అనేక రంగాలలో ఖ్యాతి గాంచిన వారి విజయగాథలతో పాటు ఏజీ కళాశాల చరిత్రను కూడా నాలుగు పుస్తకాల రూపంలో పూర్వ విద్యార్థులు గతంలోనే అందుబాటులోకి తెచ్చారు. ఈ పుస్తకాలకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలని పబ్లిక్ లైబ్రరీతో పాటు చెన్నైలోని కన్నెమెర, ముంబైలోని సెంట్రల్, కోల్‌కతాలోని నేషనల్ లైబ్రరీల్లో ఆ పుస్తకాలను ఉంచుతున్నట్లు కేంద్ర గ్రంథాలయ సమాచార విభాగం శుక్రవారం ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది. వెలుతురు తోవలు, వెలుగుపూలు, వెలుగుదివ్వెలు, ఒక నేల అనేక ఆకాశాలు అనే నాలుగు సంకలనాలు దేశంలోనే పేరెన్నిక గల గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండే ఖ్యాతిని దక్కించుకున్నాయి. ఈ ఘనత దక్కడం పట్ల బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి 1980 బ్యాచ్‌కు చెందిన గోపిచంద్ హర్షం వ్యక్తం చేశారు

పారదర్శకంగా ఏఎన్‌యూ బీఈడీ ప్రయోగ పరీక్షలు

సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు



పెదకాకాని, ఏప్రిల్ 4(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవి ద్యాలయం పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) ప్రయో గ పరీక్షలు పారదర్శకంగా జరు గుతున్నాయని ఏఎన్యూ పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల సమన్వ యకర్త ఆచార్య ఎం. సుబ్బారావు శుక్రవారం తెలిపారు. పరీక్షలు జరిగే తీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయిస్తూ పరీక్షలు సమర్థవంతంగా జరగటానికి తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రయోగ పరీక్షల సమయంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లుగా నేటికీ తమకు ఎలాంటి ఫిర్యాదులు అంద లేదని, దీంతోపై విద్యార్థులు ఎవరైనా తమకు ఫిర్యాదు చేస్తే కళాశాలలపై కఠిన చర్యలు తీసు కుంటామని సూచించారు. తనిఖీ బృందాల నియామకంలో అధ్యాపకుల పనితీరును ప్రామా ణికంగా తీసుకుంటున్నామని, ఎవరిపైనైనా ఆరోపణలు వచ్చి నిరూపణ అయితే, అలాంటి అధ్యాపకులను తనిఖీ బృందాల నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. ఇటీవల జరిగిన బీఈడీ థియరీ పరీక్షల ప్రశ్నపత్రం లీకేజ్ సమాచారం తెలియగానే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశ్నాపత్రం లీక్ చేసి న వారిపై పోలీస్ కేసు నమోదు చేయించాము. ఆ పరీక్షను రద్దుచేసి మరలా నూతన ప్రశ్నాపత్రంతో పరీక్షను సమర్థంగా నిర్వహించి బీఈడీ పరీక్షలతో పాటు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను కాపాడామని వివరించారు. విశ్వవిద్యాలయం పరిధిలోని కొన్ని బీఈడీ కళాశాలలకు ఎన్సీటీఈ జారీ చేసిన నోటీసులకు, తాము నిర్వహిస్తున్న బీఈడీ థియరీ, ప్రయోగ పరీక్షలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. బీఈడీ ప్రయోగ పరీక్షలను ఎప్పటికప్పుడు తాను పర్యవేక్షించడంతో పాటు తనిఖీ బృందాల చేత తనిఖీ చేయిస్తూ పరీక్షల్లో అక్రమాలకు తావు లేకుండా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఉపాధ్యాయ విద్య ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దేలా పరీక్షలను నిర్వహిస్తున్నామని సమన్వయకర్త సుబ్బారావు పేర్కొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

టీడీపీ నేతలతో మంత్రి లోకేశ్ ఇష్టాగోష్టి

మంగళగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులతో మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కొద్దిసేపు ఇష్టాగోష్టి నిర్వహించారు. తొలిరోజు ఇళ్ల పట్టాల పంపిణీ అనంతరం వేదికపై పార్టీ నేతలతో ముచ్చటించారు. పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు పోతినేని శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు, ముమ్మిడి సత్యనారాయణ, ఆరుద్ర భూలక్ష్మీ, షేక్ రియాజ్, వింజమూరి ఆషాబాల, కారంపూడి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టం గురించి తెలుసుకోవాలి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం గురించి ప్రజలందరూ తెలుసుకోవాలని గుంటూరు సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు టీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వింజనంపాడులో శుక్రవారం సమాచారహక్కు చట్టం 2005పై రైతులకు, సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఏవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వకార్యాలయాల్లో జరిగే కార్యకలాపాల వివరాలతోపాటు, సంక్షేమపథకాల అమలుపైనా అవగాహన కల్పించేందుకు సహచట్టం ఉపయోపడుతుందని ఏఓ పి.శిరీష అన్నా రు. మండలంలోని పెదపాలెం, ఈమని గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల్లో అందించే సేవలపై సమాచారానికి సంబంధించి అవగాహన సదస్సులను శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఏఈఓ రమేష్‌బాబు, అలేఖ్య, సౌమిత్రిపాల్గొన్నారు.

● ఫిరంగిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సహ చట్టంతో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల పని తీరును తెలుసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి జే వాసంతి అన్నారు. శుక్రవారం మండలంలోని నుదురుపాడులో సహ చట్టంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ సుభానీ, తదితరులు పాల్గొన్నారు.

635 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయమార్కెట్ కమిటీయార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 635 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,225, గరిష్ఠధర రూ.13,250, మోడల్‌ధర రూ. 12,811 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,225, గరిష్ఠధర రూ. 12,850, మోడల్‌ధర రూ. 12,811 పలికాయి.

వైభవంగా శ్రీచండీహోమం

దుగ్గిరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో శ్రీచండీహోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోమంలో గణేష్‌శ్రీవాస్తవ, రుత్విక్‌చౌదరి సింధుశ్రీ తదితరులు పాల్గొని పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈఓ కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త రంగప్రసాద్ పర్యవేక్షణలో హోమం నిర్వహించారు.

రెండు ఇసుకట్రాక్టర్‌ల స్వాధీనం

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండుట్రాక్టర్‌లను దుగ్గిరాల పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకలోడుతో వస్తున్న సమాచారంతో పోలీసులు వారిని అడ్డగించి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై అదనపు భారాలుగా ఉన్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా, కార్యదర్శి వై నేతాజీ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కుంచనపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, అమ్మిశెట్టి రంగారావు, సింగంశెట్టి రవికిషోర్, బొడ్డు మోహనరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో స్వచ్ఛ మంగళగిరి

తాడేపల్లి (పెనుమాక), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెనుమాకలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో టిడిపి రూరల్ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా స్వచ్ఛ మంగళగిరి కార్యాక్రమం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ నుండి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా రైతు అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పాలెపు బాబీ, కళ్లం శివగోవింద రెడ్డి, పఠాన్ జానీఖాన్, శ్రీనుబాబు, మాణిక్యం, కోటేశ్వరరావు, గోపాలరావు, నాగార్జున, నాయక్, నరసింహారావు, యేసురత్నం, గోపి శివరామకృష్ణ పాల్గొన్నారు.

వీఆర్ఏల సదస్సును జయప్రదం చేయండి

ఫిరంగిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల రాష్ట్రసదస్సును జయప్రదం చేయాలని వీఆర్ఏల మండల గౌరవ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలో జరిగిన వీఆర్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరగనున్న సదస్సుకు రాష్ట్రంలోని వీఆర్‌ఏలంతా పాల్గొనాలని కోరారు.

సచివాలయంలో అగ్నిప్రమాదంపై ఫిర్యాదు

వెలగపూడి(తుళ్లూరు), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం రెండో బ్లాక్‌లో శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంపై తుళ్లూరు పోలీసులకు సెక్యూరిటీ సిబ్బంది ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 45 బ్యాటరీలు కాలిపోవడంతో యాక్సిడెంట్ జరిగినట్లు తెలిపారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ-2 అంజయ్య తెలిపారు.

నవమికి ఆలయాల ముస్తాబు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న శ్రీరామనవమి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరుపుకునేందుకు మండలంలోని కోదండ రామాలయాలను గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. చమళ్ళమూడిలో భారీ ఎత్తున చలువపందిళ్లు వేసి కల్యాణానికి విస్తృత ఏర్పాటు చేశారు. మండల గ్రామాల్లోని ఆలయాలను రంగులతో తీర్చిదిద్దారు. చమళ్ళమూడి, లేమల్లెపాడు గ్రామాల్లో అన్నదానకార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు.

● పెదనందిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామ దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్ణుసహస్రనామపారాయణం, భజనకార్యక్రమాలుజరిగాయి.

ఎమ్మెల్సీ ఆలపాటికి జన్మదిన శుభాకాంక్షలు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదుకు శుక్రవారం తెలుగు విద్యార్థి నాయకులు మన్నవ వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ పూనాటి రమేష్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయను ప్రత్యేకంగా కలిసి వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు.

పేదింట పట్టాల పండుగ

● కుటుంబసభ్యులతో హాజరైన లబ్ధిదారులు
● స్వయంగా అందించిన మంత్రి లోకేశ్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టా అందజేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. దశాబ్దాల నాటి కల సాకారమవుతున్న వేళ లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబసభ్యులతో కలిసి పట్టాభిషేకం కార్యక్రమానికి విచ్చేసి మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శాశ్వత ఇళ్లపట్టాలను అందుకున్నారు. మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఇళ్ల పట్టాలతోపాటు భార్యాభర్తలకు నూతన వస్త్రాలు, మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో వేదికపైకి రాలేనివారికి మంత్రి లోకేశే స్వయంగా కిందకు వచ్చి ఇళ్లపట్టాలను అందించారు. తొలిరోజు మంగళగిరి పట్టణంలోని రత్నాలచెరువుకు చెందిన 199 కుటుంబాలకు, నీరుకొండ గ్రామంలో 99 కుటుంబాలు, ఎర్రబాలెంలో 248 కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

తొలుత ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లోని రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మీ ఇంటికి గురువారం స్వయంగా వెళ్లిన మంత్రి లోకేశ్ నూతన వస్త్రాలు పెట్టి మొదటి ఇంటి పట్టాను అందజేశారు. స్వయంగా మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఇళ్లపట్టాలను అందుకున్న లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. లబ్ధిదారు తిరుమల స్పందిస్తూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లను తొలగిస్తుండడంతో లోకేశ్‌ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశామన్నారు. అప్పుడు లోకేశ్ ఇచ్చిన హామీమేరకు ఇంటి పట్టా అందించడం ఆనందంగా ఉందన్నారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన కాజా భారతి అనే వృద్ధురాలు మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తాము కుమార్తె, ఇద్దరు మనుమలతో ప్రభుత్వ పించన్‌పై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు.శాశ్వత ఇంటిపట్టా మంజూరు చేయడంతో కొత్తగా ఇల్లు నిర్మించుకుంటామని చెప్పారు. మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన అడిగోపుల మల్లీశ్వరి అనే వృద్ధురాలు మంత్రి లోకేశ్ నుంచి పట్టాను అందుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. మంత్రి లోకేశ్ వేదిక కిందకు వచ్చి ఆమెకు పట్టాను అందజేశారు. శాశ్వత ఇంటి పట్టాను అందజేసిన లోకేశ్‌కు మల్లేశ్వరీ ధన్యవాదాలు తెలిపారు.



ఇళ్ల పట్టాలు అందుకున్న మహిళలు

దుగ్గిరాల యార్డు చైర్మన్‌గా ఉన్నం ఝాన్సీరాణి



మంత్రి లోకేశ్‌తో ఉన్నం ఝాన్సీరాణి

దుగ్గిరాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నం ఝాన్సీరాణి నియమితులయ్యారు. పార్టీలో చేరిన నాటినుంచి టీడీపీలోనే కొనసాగుతూ, వివిధ హోదాల్లో కొనసాగిన ఝాన్సీ పార్టీకి అందించిన సేవలను గుర్తించిన అధిష్ఠానం యార్డుచైర్మన్‌గా అవకాశం కల్పించింది. జిల్లాఎస్సీసెల్ మహిళా ఉపాధ్యక్షురాలిగా, గుంటూరు పార్లమెంటు మహిళా కార్యనిర్వాహక కార్యవర్గసభ్యురాలిగా పనిచేసిన ఝాన్సీ ఎంపీపీగా పనిచేశారు. తనకు యార్డుచైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి నారా లోకేశ్‌కుతోపాటు రాష్ట్రపద్మశాలీయ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గూడూరు వెంకట్రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేఎల్‌యూలో ఘనంగా అంతర్జాతీయ మహిళా సమ్మిట్



జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ మహిళా సమ్మిట్ ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా సమ్మిట్‌ను కెఎల్ ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పలువురు మహిళలతో కలిసి వర్సిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు నూతన ఆవిష్కరణలలో మహిళల పాత్ర, టెక్నాలజీ, మహిళా సాధికారిత రాబోయే తరానికి మహిళా నాయకత్వం వంటి ఏడు అంశాలపై విస్తృతస్థాయి బృందాలుగా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఈఎఫ్ కార్యదర్శి కోనేరు శివ కాంచనలత, సభ్యురాలు కోనేరు నిఖిల, గుంటూరు సమగ్ర ఆసుపత్రి కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ కె నీరజ, యుఎస్ఏ శాన్‌డియాగో యూనివర్సిటీ డీన్ డాక్టర్ మహాశ్వేత సర్కార్, కాసా ఎలైట్ డైరెక్టర్ ప్రీతి కొరటాల, రాష్ట్ర విపత్తుల శాఖ మేనేజర్ యశస్విని పెద్ది, చినోయ్ డిజైన్ మేనేజింగ్ డైరెక్టర్ సాందీపని వజ్జి, అఖిలభారత సైకలాజికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు కె లక్ష్మీ తులసిబాయి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బొల్లినేని కీర్తి, హోప్‌విన్ ఆసుపత్రుల సీఈవో ఎండీ షమాసుల్తానా, క్రాంతి నందిగం, హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల, డాక్టర్ కెఆర్ ఆర్ ఇన్నోవేషన్ డైరెక్టర్ సీఈవో రష్మిక రావు, లిటిల్ బ్లాక్‌స్టార్ కో ఫౌండర్ తిరుమలశెట్టి మేఘన, ఫన్‌టైమ్ ఉపాధ్యక్షురాలు సుమ అట్లూరి, సమ్మిట్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రమ్య, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీసీ సారథివర్మ, ప్రోవీసీలు వెంకట్రామ్, ప్రసాద్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, గోవర్ధని, సీహెచ్ శ్రీకావ్య, డాక్టర్ కె సోని, హరిత, డాక్టర్ ఏ ప్రియ, డాక్టర్ పి లక్ష్మీప్రసన్న, డాక్టర్ వి శైలజ, శాంతిశ్రీ, కోనేరు స్వప్న పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి లక్ష్యం

డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని అందుకు అనుగుణంగా మహిళల ఆర్థికాభివృద్ధి అనేక పథకాలు రూపకల్పన చేయడం జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు రుణ మరియు జీవనోపాధుల ప్రణాళికలపై ఎన్యూమరేటర్లకు, వీవోఏలకు శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈ తరగతులలో ఆమె మాట్లాడుతూ మహిళలకు ఏ రంగంలో ఆశక్తి ఉంటే ఆ రంగంలో శిక్షణ ఇప్పించి వారి చేత వ్యాపారం చేయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొనుగోళ్లు, అమ్మకాల విషయంలో కూడా తోడ్పాటు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో కామేశ్వరి, రాంబాబు, ఏపీఎం లాజరు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

తుళ్లూరులో సీఐటీయూ ర్యాలీ.. నేతల డిమాండ్

తుళ్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాలలో పని చేస్తుస్తున్న పారిశుధ్య కార్మికులకు రెండు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు బీ.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. తుళ్లూరులో శుక్రవారం ర్యాలీ నిర్వహించి అనంతరం సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులకు నెలకు రూ.21 వేల ఇవ్వాలన్నారు. సామాజిక ఫించన్‌ను గత జనవరి నుంచి పునరుద్ధరించిమని ఎమ్మెల్యే చెబుతున్నా అమలు చేయడం లేదన్నారు. ఎక్కడైతే పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారో అక్కడ నుంచే పేదరికం నిర్మూలన ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలోనాయకులు సీహెచ్ సుశీల, యేసు దయమ్మ, జీ బుజ్జీ, ఎన్ వీరలంకమ్మ, ముత్యాలు, దుర్గ మాలతి, రత్నకుమారి, గురవమ్మ అంజలి, వెంకటరమణ జోజి, వెంకటేశ్వరావు, అరుణ్‌కుమార్, మల్లేశ్వరిదేవి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి సహకరించాలి

● పేరేచర్లలో డీపీవో నాగసాయికుమార్



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీవో నాగసాయికుమార్

మేడికొండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీపీవో నాగసాయికుమార్ చెప్పారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆయన శుక్రవారం పేరేచర్ల గ్రామ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడి చెత్త నుంచి వర్మి కంపోస్టు, పొడిచెత్తను వేరు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయము వస్తుందని తెలిపారు. హరిత రాయబారులు తప్పనిసరిగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి పాటిబండ్ల పూర్ణశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు రామసుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎన్ఆర్ఐ కళాశాల సిబ్బంది

మేడికొండూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు మాట్లాడుతూ జగజ్జీవన్‌రామ్ అతి చిన్న వయసులో నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలికారని కొనియాడారు. ఉప ప్రధానిగా స్వాతంత్ర సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా నిర్విరామ కృషి చేశారన్నారు. 47 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిన మహోన్నత వ్యక్తి అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాబు జగజీవన్‌రావ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో బండారు సీతారామయ్య, శాఖాధిపతులు చంద్రమౌళి, రెహమాన్, నాగేశ్వరావు, సౌజన్య తదితరులతో పాటు బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



దేవాలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ నాగూర్‌మీరాసాహెబ్

మేడికొండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవాలయాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ నాగూర్‌మీరాసాహెబ్ తెలిపారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆలయాల కమిటీ సభ్యులు, పూజారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో సీఐ మాట్లాడుతూ దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

ఘనంగా లక్ష మల్లెల పూజ

పెదనందిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నపర్రులో నూచాలమ్మ తల్లి దేవస్థాన 4వ వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజు శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

కాలినడకన తిరుమలకు బీజేపీ నాయకులు

పెదనందిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్, వెలగా రాఘవయ్యచౌదరి తిరుమలకు కాలినడకతో వెళ్లారు. తొలుత సోమేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వారికి పలువురు కూటమి నేతలు వార్లు పోసి, స్వాగతం పలికారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో మూడో పర్యాయం ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తిరుమలకు వెళ్లి మొక్కు చెల్లించుకోనున్నట్లు వారు తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెదనందిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన కొప్పుల స్వరూప తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 18న వేకువజామున ద్విచక్ర వాహనంపై ఓ మహిళతో వెళ్లాడని, ఆ సమయంలో ఇంట్లోని 50 వేల నగదు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో స్వరూప తెలిపింది. దీనిపై ఎస్ఐ మధు పవన్ కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన కొండయ్య మృతి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వారంనుంచి కన్పించకుండా పోయిన ఓ వ్యక్తిని మండలంలోని ముట్లూరు గ్రామ సమీపంలోని ఓ జొన్నచేలో మృతదేహంగా గుర్తించారు. చేలో దుర్వాసన వస్తుండటంతో కూలీల నుంచి సమాచారం అందుకున్న సీఐ రమానాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తమ తండ్రి కుంచాల కొండయ్య కనిపించడం లేదని కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 2న కేసునమోదు చేశారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులను పిలిపించగా వారు కొండయ్య మృతదేహాన్ని గుర్తించారు. పక్షవాతంతో ఉన్న తమ తండ్రి ఇక్కడకు వచ్చి చనిపోయి ఉంటాడని కుటుంబసభ్యులు సీఐకి తెలిపారు.



కొండయ్య(ఫైల్)

కన్న కొడుకులు వదిలేశారు... తహసీల్దార్ ఆదుకున్నారు

● వివరాలు తెలుసుకుని కుమార్తెల చెంతకు చేర్చిన తహసీల్దార్



వృద్ధుడిని కుమార్తెల చెంతకు చేర్చిన తహసీల్దార్

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల వృద్ధుడు.. కళ్లు కనపడని పరిస్థితి.. నీరసంలో నడవలేని దుస్థితి.. ఉండవల్లి గ్రామంలోని రెడ్ల బజారులో ఓ వీధిలో గురువారం రాత్రి 9 గంటలకు ఓ అరుగుమీద పడుకున్నాడు. స్థానికులు ఆరా తీసినా సమాధానం చెప్పలేని పరిస్థితి. స్థానికులు భోజనం పెట్టి దుప్పటి ఇవ్వగా, అలాగే రాత్రి కురిసిన వర్షంలో ముద్దయి పడుకుండిపోయాడు. తెల్లవారుజామున స్థానికులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు విషయాన్ని తెలియజేశారు. తాడేపల్లి తహసీల్దార్ డి సీతారామయ్య అక్కడకు వచ్చి వృద్ధుడితో మాట్లాడారు. తనది ప్రకాశం జిల్లా, అర్థవీడు మండలం, వీరభద్రాపురం అని, తనకు ఆరుగురు సంతానమని, కుమారుల పేర్లు చెప్పగలిగాడు. తనను కన్నబిడ్డలే వదిలేశారని.. పొట్ట కూటికోసం దారి తెలియక ఇక్కడకు వచ్చానని.. తన పేరు బాపయ్య అని కన్నీటి పర్యంతమయ్యాడు. వెంటనే ఆ వృద్ధుడికి బట్టలు కొనిపించి తన కారులో ఎక్కించుకుని తాడేపల్లిలోని అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేణ నిత్యాన్నదాన సత్రం వృద్ధాశ్రమంలో చేర్పించారు. వీఆర్‌వో దుర్గారమేష్, ఇద్దరు వీఆర్‌ఏలను వృద్ధుడికి సాయంగా ఉంచారు. అనంతరం సీఐకు విషయం చెప్పి కుమారులు, కుమార్తెల ఆచూకీ కొరకు ఆరా తీయగా ఫోన్ చేసినా వారు స్పందించలేదు. చివరకు కుమార్తెలు బీబీ, రసూల్‌బీ, భార్య మౌలమ్మ, నులకపేటలో ఉంటున్నట్లు తెలుసుకుని వారికి సమాచారం అందించారు. మతి స్థిమితం లేకుండా ఇటీవలే ఇంటి నుండి వెళ్లిపోయాడని ఆరా తీస్తున్నామని భార్య, కుమార్తెలు తహసీల్దార్‌కు చెప్పారు. బాపయ్యను కుమార్తెలు, భార్యకు అప్పగించి కొంత ఆర్థికసాయం చేశారు.

ఘనంగా ఆలపాటి జన్మదిన వేడుకలు



ఆలపాటికి శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటూరు నగరం లక్ష్మీపురంలోని ఆలపాటి కార్యాలయంలో అభిమానులు పుష్పగుచ్ఛం ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు పంచుమర్తి భూపతిరావు, టీడీపీ నాయకులు కంకణంపాటి లక్ష్మణరావు, అడపా శివ ప్రసాద్‌బాబు, పాములపాటి శ్రీనివాస్, నలబోతు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న కిషోర్ యూత్ తదితరులు

ఘనంగా కిషోర్‌కుమార్ జన్మదినవేడుకలు

తాడేపల్లి(ఉండవల్లి), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉండవల్లికి చెందిన లింగంశెట్టి అసోసియేట్స్ అండ్ కన్సల్టెన్సీ అధినేత, టీడీపీ నేత లింగంశెట్టి కిషోర్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు ఉండవల్లిలో ఘనంగా నిర్వహించారు. శుభోదయం సూపర్ మార్కెట్ వద్ద 250 మంది కార్మికులకు నూతనవస్త్రాలు పంపిణీ చేసి 800 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు జంగాల సాంబశివరావు ప్రారంభించి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వంశీ హైస్కూల్‌లో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కిషోర్ అభిమానులు భారీ కేక్ కట్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో నేతలు జంగాల సాంబశివరావు, జంగాల వెంకటేష్, మానికొండ డాంగే, గోపాలం వాసు, గోపాలం కొండయ్య, బసివిరెడ్డి, దాసరి కృష్ణ, శివ, భాస్కర్, టిఎన్నార్ మాస్టారు, ప్రసాద్ మాస్టారు, కిషోర్ యూత్, స్నేహితులు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల అవస్థలు

పెదనందిపాడు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం వేకువజామున కురిసిన అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. ఉరుములతో కూడిన వర్షంతో రైతులు కల్లాల వద్దకు పరుగులు తీశారు. ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక కూలీల భారంతో కొంతమంది రైతులు పొలాల్లోనే పొగాకును దూసి మండెలుగా వేశారు. మొక్కజొన్న పంటను మిషన్ వేసి కల్లాల్లో ఆరబెట్టారు. వేకువజామున కురిసన వర్షంతో పొగాకు పందిళ్లు నేలకొరగగా, మొక్కజొన్న కల్లాల్లో వర్షపు నీటితో నిండిపోయాయి. వాటిని బయటకు తోడిపోసేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. పొలాలను వ్యవసాయశాఖ అధికారి సుధారాణి పరిశీలించారు.

ఆందోళనలో రైతులు...

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారుజామున గాలులతో అకాల వర్షం కురిసింది. దీంతో కల్లాలు, రాసుల్లో ఉన్న మిర్చి, పందిళ్ళల్లో ఉన్న బర్లి పొగాకు తడిచిపోయింది. వర్ష సూచనలతో అప్రమత్తమైనా కొంతమేర నష్టం జరిగిందని రైతులు తెలిపారు. కూలీల కొరత, ధరల పతనంతో గతంలో కోసిన మిర్చి కల్లాల్లోనే రాసులుగా నిల్వ చేశారు. అర్ధరాత్రి నుంచి సన్నగా వర్షపు జల్లులు ప్రారంభమై మూడు, నాలుగు గంటల మధ్య భారీ వర్షంతో టార్పాలిన్ పట్టలు కప్పినప్పటికీ అధిక శాతం కల్లాల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం...

కాకుమాను, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ స్తంభాలు ఒరిగి పోయాయి. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. వర్షంతో మెట్ట పంటలు జీవం పోసుకుంటాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల మధ్యే మురుగునీరు...

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఆ ప్రాంతం మొత్తం జలమయమైంది. నీరు పోయేమార్గం లేక మురుగునీరు వర్షపునీరు కలిసి ఇళ్ల మధ్యేనిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ఇళ్లలోకి మురుగు నీరు ప్రవహించింది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పొన్నూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇటికంపాడు రోడ్డులోని శ్రీరామా మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించాల్సిందిగా సూచించారు. ప్రతిరోజు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ సూచించారు.

రైలులో ప్రయాణిస్తూ యువకుడు మృతి



మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

తెనాలి క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువకుడు రైలులో ప్రయాణిస్తూ ఆకస్మికంగా మృతి చెందాడని తెనాలి రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు కోయంబత్తూరు నుంచి ఉత్తరప్రదేశ్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో 23 సంవత్సరాల యువకుడు మృతిచెంది ఉండగా తోటి ప్రయాణికులు గుర్తించారు. వెంటనే ఆ రైలు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రైలు సిబ్బంది సమాచారంతో తెనాలి రైల్వే పోలీసులు స్టేషన్‌లో మృతదేహాన్ని దింపి రైల్వే వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని పూర్తి వివరాలు అందవలసి ఉందని మృతుడు కోయంబత్తూరు నుంచి ఉత్తర ప్రదేశ్‌కు వెళుతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కుంభాభిషేకం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలగపాలెం కోదండరామాలయం మహా కుంభాభిషేకం శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కుంభాభిషేకం సందర్భంగా ప్రతిష్టించిన యంత్ర బింబానికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్ర జాలలతో నింపిన కలశాలను ఆలయ శిఖరం పైకి తీసుకువెళ్లి కుంభాభిషేకం క్రతువును వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహా శాంతి హోమం, పూర్ణాహుతి జరిపారు. కుంభాభిషేకం తిలకించేందుకు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

శిల్పాలను సందర్శించిన మంత్రి కందుల

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఏర్పాటు చేసిన చిత్రకళా వీధిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించినట్లు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శిల్పులు రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. అనంతరం కాటూరి స్కల్ప్చర్ బ్రోచర్ ఆవిష్కరించారు. సాంస్కృతిక సేవా సమితి చైర్‌పర్సన్ తేజస్విని, డైరెక్టర్ మల్లికార్జునరావు తమ శిల్పాలను తిలకించి అభినందించారన్నారు.



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు

కనకదుర్గమ్మకు గాజుల అలంకారం

తెనాలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు అగస్త్యేశ్వర స్వామి వారి దేవాలయంలోని కనకదుర్గమ్మకు ప్రత్యేకంగా గాజుల అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వివిధ రంగుల గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు కదిలి రావాలి: జంగాల

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమవుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు కదిలి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శివాజీ చౌక్‌లో ప్రధాని మోదీ పాలనకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దీనికి నిరసనగా పెద్దఎత్తున ఉద్యమించేందుకు దేశ వ్యాప్తంగా మార్చి 23 నుంచి ఏప్రిల్ 14వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. చెరుకుమల్లి సింగారావు, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

రేపు కొలకలూరులో కంటి వైద్యశిబిరం

తెనాలిరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినంను పురస్కరించుకుని ఆదివారం కొలకలూరు జూబ్లీ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సుద్దపల్లి మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ ఈ వైద్యశిబిరం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఫోన్ నెంబరు, గతంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడుతుంటే వాటి వివరాలతో రావాలని కోరారు.





ప్రధాన రహదారిపై కుప్పలుగా ఉన్న ఇసుక

తెనాలి- నారాకోడూరు రహదారిపై

ప్రమాదకరంగా ఇసుక

తెనాలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెనాలి నుంచి నారాకోడూరు ప్రధాన రోడ్డు వెంబడి పేరుకుపోయిన ఇసుక వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గత కొంత కాలంగా భారీ లారీల్లో పరిమితికి మించి ఇసుక నింపి వాటిపై పట్టలు కప్పకుండా ఇష్టారాజ్యంగా నడుపుతుండటంతో వాహనాల నుంచి జారి రోడ్డు వెంబడి ఇసుక రాసులుగా పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రులు ఆ రోడ్లపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు ఇసుక వద్ద అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇసుక తొలగించి రోడ్డు ప్రయాణం సురక్షితంగా జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వస్తున్న వాహనాలను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఒంగోలు జాతి పశువుల అభివృద్ధికి ప్రోత్సాహమందిస్తాం

● ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



సభలో ప్రసంగిస్తున్న చింతమనేని ప్రభాకర్, వేదికపై నరేంద్రవర్మ తదితరులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతరించి పోతున్న ఒంగోలు జాతి పశువుల అభివృద్ధికి ప్రభుత్వం తరుపున ప్రోత్సాహమందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తెనాలిలో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్‌గా నిర్వహిస్తున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశుపాల పోటీలకు చివరిరోజు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, వేగేశ్న నరేంద్రవర్మ, తెనాలి శ్రావణ్‌కుమార్ పలు కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ రంగాల ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువుల పోషణ అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. ఒక్కో జతకు నెలకు రూ.2 నుండి రూ.3లక్షలవరకూ ఖర్చు అవుతుందన్నారు. ఫలితంగా రోజురోజుకు ఒంగోలు జాతి ఎడ్లు పెంపకం తగ్గుముఖం పడుతుందన్నారు. వీటిపెంపకానికి అయ్యే ఖర్చులో కొంత భాగం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించేలా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలుగా తాము కూడా పశుసంవర్థక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తెనాలి ప్రాంతంలో ఇంత పెద్దఎత్తున వేలాదిమంది రైతుల సమక్షంలో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన, పశుపాల పోటీలు నిర్వహించేలా ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కన్వీనర్ నక్కా ఆనందబాబులను అభినందించారు. వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనతో తెనాలి మార్కెట్ యార్డు ప్రాంగణం పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. తొలుత ఎమ్మెల్సీ ఆలపాటి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. దివంగత ఎన్టీఆర్, ఆలపాటి శివరామకృష్ణయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఒంగోలు జాతి పశువును తరతరాలుగా పోషిస్తున్న ముళ్లపూడి నరేంద్రనాద్‌ను ఆలపాటి రాజేంద్రప్రసాద్ కమిటీ సభ్యులు సన్మానించి మెమొంటోను అందజేశారు. నిర్వాహక కమిటీసభ్యులు పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పెద్దఎత్తున రైతులు తదితులు పాల్గొన్నారు.



ముళ్లపూడి నరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిలో చింతమనేనికి ఘన స్వాగతం

దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు తెనాలిలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు అభిమానులు పైనాపిల్‌తో తయారు చేయించిన భారీ గజమాలను వేసి స్వాగతం పలికారు. బైక్ ర్యాలీగా ఆయనను మార్కెట్ యార్డులో జరుగుతున్న ఎద్దుల పోటీల సభా ప్రాంగణానికి తీసుకువచ్చారు.

వ్యవసాయ పరిశోధనలో పూర్ణచంద్రరావు కృషి అభినందనీయం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనలో శాస్త్రవేత్త పూర్ణచంద్రరావు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శనలో శుక్రవారం ఆయనను సన్మానించారు. మన నేలలే మన భవిత పేరుతో మెరుగైన పంటలకు అనువైన నేలల సమాచారం పుస్తకాన్ని అందించిన ఆయన రైతులకు ఎంతో మేలు చేశారని చెప్పారు. నేటి వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనిక మందుల వినియోగం ఎక్కువ అవుతున్న తరుణంలో శాస్త్రవేత్తలు రైతులను స్వాభావిక ఎరువులతో పంటలు పండించే దిశగా చైతన్యం తెస్తున్నారని చెప్పారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఈ పుస్తకంపై ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధంలో సమీక్ష వచ్చిందన్నారు. రైతులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆయనను అభినందించారు.



పీహెచ్‌సీకి వాటర్ కూలర్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అర్బన్ హెల్త్ సెంటర్‌కు వాటర్ కూలర్ వితరణ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్‌కు వాటర్ కూలర్‌ను రోటరీ క్లబ్ సభ్యులు వితరణగా అందజేశారు. స్థానిక కొత్తపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదినోత్సవంగా సందర్భంగా రోటరీ క్లబ్ తెనాలివారు బత్తుల వెంకటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్‌ల సౌజన్యంతో వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రియాంక, గుత్త వెంకటరత్నం, కన్నెంటి మురళీకృష్ణ, పావులూరు రాంబాబు, గుమ్మడి ప్రసాద్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది వి.సునీత, ఏ శిరీష, వి.ధనలక్ష్మి, బి.హరికృష్ణ, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

నంబూరులో మినుములు, పెసల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పెదకాకాని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రప్రథంగా పెదకాకాని మండలంలోని నంబూరులో మినుములు, పెసల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ మార్కెట్ ఫండ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. శుక్రవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పార్టీ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ కనీస మద్దతు ధరపై మినుములు క్వింటా రూ.7,400,పెసలు క్వింటా రూ.8,682 కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు కొంటున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రాన్ని మన మండలంలో ప్రారంభించినందుకు నరేంద్రకు ధన్యవాదాలు తెలిపినారు. మండలంలో సుమారు పదివేల ఎకరాలలోరైతులు పెసర పంట పండించారని దళారుల మాటలు విని తక్కువ రేటుకు అమ్ముతున్నారని తెలిసి రైతులు నష్టపోకుండా పెసలు క్వింటా 8,682 ప్రభుత్వం వారితో కొనుగోలు చేసేలా చేసిన ఎమ్మెల్యే నరేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల దగ్గర పంటను కొనగానే ప్రభుత్వం వారికి డబ్బులు పడేలా చూస్తుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో అన్ని పంటలు పండించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

కొల్లిపర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో అన్నిరకాల పంటలు పండించాలని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర శివారు గుడిబండివారిపాలెం కల్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చునన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంచేసి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రైతులు పీఎండీఎస్ విత్తనాలను నాటడం వలన భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. తెనాలి ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడటం వలన నష్టపోతున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ఘన జీవామృతాలను వాడుకోవడం మంచిదన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, డీఎల్‌ఎంపీ సత్యన్నారాయణ, ఎంటీఎల్ మాధవి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

భారీవర్షంతో ఒరిగిన విద్యుత్ స్తంభాలు



ఒరిగిన విద్యుత్ స్తంభం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గురువారం అర్థరాత్రి కురిసిన ఈదురు గాలులు, అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కట్టెంపూడి గ్రామం వద్ద విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొద్ది రోజులుగా ఎండ వేడిమి పెరగటంతో ఒక్కసారి వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొద్దిగా ఉపశమనం పొందారు. పలు ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విరిగి పడడం విద్యుత్ స్తంభాలు ఒరిగి పోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ లైన్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షంతో మెట్ట పంటలు తమలపాకు, కూరగాయలు సాగు చేసే రైతులు పంటల జీవం పోసుకుంటాయని పలువురు తెలిపారు.

సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌పై అవగాహన

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహించారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ - 2025పై లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీముపై భవన నిర్మాణ యజమానులకు నిబంధనలను తెలిపి అప్లికేషన్లను దాఖలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ అప్లికేషన్ల అనుమతుల కోసం అవసరమయ్యే బ్యాలన్స్ ఫీజులు, డాక్యుమెంట్లతో దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ 1 అండ్ 2 శివన్నారాయణ, వి.వాణి, టీపీవో సాంబశివరావు, లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలను ఆదరించాలి: యోహాను

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని నిర్మాత, నటుడు పెద్దింటి యోహాను విజ్ఞప్తి చేశారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం యోహాను మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే కృషి ఇతివృత్తంగా నిర్మించిన చిత్రాన్ని ఈ నెల 10న తెనాలి పెమ్మసాని థియేటర్‌లో ప్రదర్శిస్తామన్నారు. కళాకారులు, సినీ అభిమానులు, సాహితీవేత్తలు చిత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు

డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక చెంచుపేటలోని 27వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు డ్రెయిన్లను ఆక్రమించటం వలన, మురుగు పారుదలలో అడ్డంకులు ఏర్పడతాయన్నారు. డ్రెయిన్ల ఆక్రమణలను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అభిమానులు ఏర్పాటుచేసిన జన్మదిన కేక్‌ను కట్‌చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఘనంగా ఆలపాటి జన్మదిన వేడుకలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో వేలాదిగా వచ్చిన అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆలపాటి రాజేంద్రప్రసాద్ కట్ చేశారు. పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలపాటికి పాదరక్షలు బహూకరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు చైతన్య పాదరక్షణ యూనియన్ సభ్యులు పాదరక్షలు బహూకరించారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఆయనను శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసంలో కలిసి అభినందించారు. ఆయనపై అభిమానంతో సభ్యులందరూ కలిసి తయారు చేసిన పాదరక్షలను ఆయనకు అందించారు. తమ పెద్దలు అభిమానంతో పాద రక్షలు చేసి ఎన్టీఆర్‌కు కూడా అందించారని, అదే సంప్రదాయాన్ని తాము పాటిస్తున్నామని అబ్రహం, వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజభూషణం, యాకోబు, బుల్లియ్య చెప్పారు.



నిరసన తెలుపుతున్న మహిళలు, స్థానికులు

మద్యం షాపు తరలించాలని మహిళల ఆందోళన

తెనాలి క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందులపేట గంటా వారి వీధిలో ఏర్పాటు చేసిన కార్తికేయ వైన్స్‌ను అక్కడి నుంచి తరలించాలని శుక్రవారం మహిళలు, స్థానికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఇదే ప్రాంతంలో ప్రభుత్వ సచివాలయం, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, దేవాలయాలు, ట్యూషన్ సెంటర్లు, జనం రద్దీగా ఉంటే ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వలన తాగుబోతురాయుళ్లతో ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో నేరాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ షాపు ఏర్పాటు వలన నిత్యం విద్యార్థులు, మహిళలు, హాస్పటల్స్‌కి వచ్చే రోగులు ఈ షాపు మీదుగా రావాల్సి ఉంటుంది. వీటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే మద్యం షాపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం నుండి స్థానికులు మహిళలు, టెంట్‌లు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. షాపు తరలించే వరకు తమ నిరసన కొనసాగిస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు ధర్నాకు మద్దతుగా నిలిచారు.



ఫెన్సింగ్ చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థి సుభద్రను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఫెన్సింగ్ క్రీడాకారిణికి అభినందన

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపిన ఫెన్సింగ్ క్రీడాకారిణి మోహనరామ సుభద్రను సెయింట్ థామస్ పాఠశాల నిర్వాహకులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోజ్‌థామస్, డైరెక్టర్ పీడీ థామస్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవచ్చు

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులు జీవనోపాధి రుణాల ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవచ్చునని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక సంఘాల వార్షిక రుణాలు, జీవనోపాధి ప్రణాళిక తయారీపై ఎన్యూమరేటర్లకు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవనోపాధి రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల జీవనోపాధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జీవనోపాధి రుణాలపై డ్వాక్రా గ్రూపు సభ్యులకు అవగాహన కలిగించాలన్నారు. ఎన్యూమరేటర్లు ప్రతి డ్వాక్రా గ్రూపు వద్దకు వెళ్ళి వారి యొక్క ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఏ విధమైన జీవనోపాధి కావాలంటున్నారో వాటి వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు విజయకుమార్, మధు, పూర్ణయ్య, విజయ, ఎమ్ఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా-గుంటూరు మండల వేద విద్వత్ ప్రవర్ధక పరీక్షా సభా

తెనాలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరావూరు శ్రీ అభయహస్త సుబ్రహ్మణ్యక్షేత్రంలో మే 2 నుంచి 4వరకు వేద పరీక్షలు, వేద సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే వారికి ఆలయంలో వసతి ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.